

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు




**వైసీపీ నేతల ఒత్తిళ్లు తట్టుకోలేకపోతున్నాం**

- సెలవుల కోసం ఈసీకి ఆర్వోల మొర

7

# పిన్నెల్లి ఎస్కేప్!?



- తప్పుకున్నారా? వైసీపీ భక్త పోలీసులు తప్పించారా?
- అర్ధరాత్రికీ ఆచూకీ నిర్ధారించలేకపోయిన పోలీసులు
- రౌడీ ఎమ్మెల్యే క్రైం స్టోరీలో ట్విస్టుల మీద ట్విస్టులు
- కొలిక్కిరాని మైండ్‌బ్లోయింగ్ హైవోల్టేజీ సస్పెన్స్ డ్రామా
- ఎట్టకేలకు.. 10 సెక్షన్ల కింద పిన్నెల్లిపై కేసులు నమోదు
- ఏ1గా పేర్కొంటూ 20న చార్జిషీట్‌లో మార్పులు
- దేశం దాటిపోకుండా.. లుకౌట్ నోటీసుల జారీ
- సీఇవో ద్వారా ఈసీకి నివేదిక పంపించిన డీజీపీ

కేంద్ర ఎన్నికల సంఘం చర్నాకోలు ఝుళిపించే వరకూ కదలని రాష్ట్ర పోలీస్ యంత్రాంగం -పిన్నెల్లి ఎన్నికల అరాచకంపై బుధవారం ఉరుకులు పరుగులు తీసింది. పోలింగ్ రోజు మిట్టమధ్యాహ్నం బహిరంగంగా బూత్‌లోకి తెగబడి ఒక ఎమ్మెల్యే ఈవీఎంను ధ్వంసం చేస్తే అరెస్ట్ చేయరా? అంటూ ఈసీ తీవ్ర స్వరంతో ప్రశ్నించడంతో.. పిన్నెల్లి అరెస్ట్‌పై బుధవారం తెలుగు రాష్ట్రాల్లో హైడ్రామా మొదలైంది. పిన్నెల్లి ఆచూకీ కోసం రంగంలోకి దిగిన ఎనిమిది పోలీస్ బృందాలు.. బుధవారం అర్ధరాత్రి వరకూ ఎమ్మెల్యే ఆచూకీపై ఎలాంటి సమాచారం ఇవ్వలేకపోయారు. కాసేపు ఎమ్మెల్యే దొరికాడని, మరికొంత సమయానికి ఎమ్మెల్యే అనుచరులు మాత్రమే దొరికారంటూ రకరకాల లీకులతో పిన్నెల్లి అరెస్ట్ వ్యవహారం మైండ్‌బ్లోయింగ్ సస్పెన్స్ సినిమానే తలపించింది. ఫైనల్‌గా పోలీసులకు చిక్కినట్టే చిక్కిన పిన్నెల్లి.. బాత్రూంకు వెళ్తానని చెప్పి పరారయ్యాడన్న కథనాలూ బలంగా వినిపించాయి.

ఇదిలావుంటే, ఎన్నికల హింసపై అధ్యయనానికి రాష్ట్రంలో సిట్ ఏర్పాటైనపుడే.. అలెర్టయిన ఎమ్మెల్యే పిన్నెల్లి పాలకపక్ష పెద్దల సూచనల మేరకు పరారయ్యారన్న వాదనా తెరపైకి వస్తోంది. ఆ విషయాన్ని కప్పిపుచ్చుతూ సాక్షి చానెల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చిన పిన్నెల్లి.. గ్రేట్ ఎస్కేప్‌కు 17వ తేదీనే స్కెచ్ వేసుకున్నారన్న వాస్తవాలు ఆలస్యంగా వెలుగు చూస్తున్నాయి. తీగలాగితే డొంక కదలొచ్చన్న భయంతో పాలకపక్ష పెద్దలే.. పిన్నెల్లిని దేశం దాటించే ప్రయత్నాల్లో ఉన్నారన్న అనుమానాలూ లేకపోలేదు. వైసీపీ భక్త పోలీసులు సైతం నాటకీయ ఫక్కీని రక్తికట్టించే పాత్ర పోషిస్తూ.. మొత్తానికి ఎమ్మెల్యే పిన్నెల్లిని రహస్య ప్రాంతానికి తరలించారా? లేక ఏకంగా దేశమే దాటించారా? అన్న సందిగ్ధం రాష్ట్రాన్ని ఉత్కంఠకు గురి చేస్తోంది. అయితే, పోలీసులు తమ మెడకు చుట్టుకునేంత వరకూ సాహసం చేయకపోవచ్చని, పిన్నెల్లిని అదుపులోకి తీసుకుని ఘర్షణలు తలెత్తకుండా సైలెంట్‌గా ఏక్షణంలోనైనా హెడ్‌క్వార్టర్స్‌కు తీసుకొచ్చే ఛాన్స్ లేకపోలేదని తటస్థ వర్గాలు చెప్తున్నాయి. ఏదేమైనా.. తప్పించుకు తిరుగుతున్న పిన్నెల్లి దొరికాడా? లేదా? అన్నది మాత్రం బుధవారం అర్ధరాత్రి వరకూ పోలీసు వర్గాల నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడం గమనార్హం. కాని, పిన్నెల్లి చర్యను తీవ్రనేరాభియోగంగా పరిగణిస్తూ ఈసీ ఆదేశాల మేరకు మూడు చట్టాల కింద 10 సెక్షన్లతో కేసులు నమోదు చేయడం చూస్తుంటే.. పిన్నెల్లికి పదేళ్ల శిక్ష ఖాయమని తెలుస్తోంది. రాజకీయంగానూ పిన్నెల్లిపై అనర్హత వేటు వేయడం ఖాయమని నిపుణులు అంచనా వేస్తున్నారు.

- పూర్తి కథనాలు 3,4,5 లో..

ఇదీ పిన్నెల్లి క్రైం రికార్డు

**ఆరు హత్యలు.. లెక్కలేనన్ని దౌర్జన్యాలు!** 5

## భయం వద్దు... పార్టీ అండగా ఉంటుంది

- పిన్నెల్లి బాధితుడికి చంద్రబాబు భరోసా
- ఫోన్‌లో పరామర్శించిన టీడీపీ అధినేత

6



## తాడిపత్రి అల్లర్లపై పోలీసుల పక్షపాతం

**సీఈఓకు టీడీపీ నేతలు దేవినేని, దీపక్ రెడ్డి లేఖ**

- వివరాలు 8 పేజీలో..

## విధ్వంసం నుండి విధ్వంసం వరకు..!

- ప్రజా వేదిక కూల్చివేతతో ప్రారంభం
- ఇప్పుడు ఈవీఎం ధ్వంసంతో ప్రజాస్వామానికి పాతర
- అన్ని వ్యవస్థలనూ విధ్వంసం చేసిన జగన్‌రెడ్డి

7



# నమో భారతం..!

- గత పదేళ్లుగా దేశ ప్రజల మనసుల్లో సుస్థిరస్థానం దక్కించుకున్న ప్రధాని మోదీ
- విలక్షణ ఆలోచనలు, వినూత్న విధానాలతో తనదైన ముద్ర వేసిన ప్రధాని
- లోక్‌సభలో బీజేపీకి 26 రాష్ట్రాల్లో ప్రాతినిధ్యం కల్పించిన నాయకుడు
- 2024 లోక్‌సభ ఎన్నికల్లో టార్గెట్ 400 సీట్లు
- మూడోసారి ప్రధానిగా మోదీ పక్కా అంటున్న పలు సర్వేలు, పరిశీలకులు
- రెండు తెలుగు రాష్ట్రాల్లోనే ఎన్డీయే కూటమి అదనంగా 25 సీట్లు పొందే అవకాశం
- డబుల్ ఇంజన్ సర్కార్‌తో నవ్యాంధ్ర పునర్నిర్మాణానికి ఊతం

2

చైతన్యరథం

# నమో భారతం!

- గత పదేళ్లుగా దేశ ప్రజల మనసుల్లో సుస్థిరస్థానం దక్కించుకున్న ప్రధాని మోదీ
- విలక్షణ ఆలోచనలు, వినూత్న విధానాలతో తనదైన ముద్ర వేసిన ప్రధాని
- లోక్‌సభలో బీజేపీకి 26 రాష్ట్రాల్లో ప్రాతినిధ్యం కల్పించిన నాయకుడు
- 2024 లోక్‌సభ ఎన్నికల్లో టార్గెట్ 400 సీట్లు
- మూడోసారి ప్రధానిగా మోదీ పక్కా అంటున్న పలు సర్వేలు, పరిశీలకులు
- రెండు తెలుగు రాష్ట్రాల్లోనే ఎన్డీయే కూటమి అదనంగా 25 సీట్లు పొందే అవకాశం
- డబుల్ ఇంజన్ సర్కార్‌తో నవ్యాంధ్ర పునర్నిర్మాణానికి ఊతం



అమరావతి (చైతన్య రథం): నరేంద్ర మోదీ. గత పదేళ్లుగా జాతీయ రాజకీయాల్లో మార్మోగుతున్న పేరు. అంతర్గతంగా కొందరు అగ్రనాయకులు వ్యతిరేకించినా 2014 లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన మంత్రి పదవికి భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి దిగి ఊహించని విధంగా పార్టీని విజయ శిఖరాలవైపు నడిపించిన నాయకుడు. 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ చేతిలో ఓటమితో కేంద్రంలో బీజేపీ అధికారాన్ని కోల్పోయిన పదేళ్ల తరువాత ఆ పార్టీని అధికార పీఠంలో కూర్చోబెట్టిన నాయకుడిగా పేరుగాంచారు మోదీ.

2014 లోక్‌సభ ఎన్నికల్లో నరేంద్ర మోదీ విజయానికి మరో ప్రాధాన్యత ఉంది. 1984 లోక్‌సభ ఎన్నికల్లో రాజీవ్‌గాంధీ ప్రధాన మంత్రి అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ లోక్‌సభలో 400 పైగా సీట్లతో దిగువ సభలో స్పష్టమైన మెజార్టీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఆ తరువాత 30 ఏళ్లపాటు జరిగిన పలు లోక్‌సభ ఎన్నికల్లో ఏ పార్టీకీ, కూటమికీ స్పష్టమైన మెజార్టీ రాలేదు. ఈ మూడు దశాబ్దాల్లో కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాలే ఏర్పాటయ్యాయి. 30ఏళ్ల తరువాత లోక్‌సభలో స్పష్టమైన మెజార్టీతో కేంద్ర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన ఘనత నరేంద్ర మోదీకే దక్కింది.

## నమో.. నమో

గత పదేళ్లుగా దేశ విదేశాల్లో నరేంద్ర మోదీ పేరు విశేష ప్రాచుర్యాన్ని పొందింది. స్పష్టమైన ఆలోచన, విధానాలు, ప్రభుత్వ నిర్ణయాలను అనుకున్న విధంగా అమలు చేయడానికి అవసరమైన శక్తి, సంకల్పం, సంక్షేమం మరియు అభివృద్ధి కార్యక్రమాల్లో సమతుల్యత, విలక్షణంగా ఆలోచించడం, మాట్లాడటం, వేలాది సంవత్సరాల భారతీయ సంస్కృతి, సాంప్రదాయాల గొప్పతనాన్ని చాటి చెప్పడం, విదేశాంగ విధానంలో విప్లవాత్మక మార్పులతో దేశ ప్రయోజనాల పరిరక్షణకు పెద్ద పీట వేయడం, సమకాలీన ఏకీకృత ప్రాపంచిక వ్యవస్థ నేపథ్యంలో భారతీయ శక్తి సంపదలను ఎలుగెత్తి చాటడం, పాకిస్తాన్ కవ్వింపులను మరియు దుస్సాహసాలను ధీటుగా ఎదుర్కొనడం, దేశ విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహానికి పలు చర్యలు తీసుకోవడం, దేశ జనాభాలో అధిక భాగమైన యువతకు తమ భవిష్యత్ పట్ల నమ్మకాన్ని కల్పించడం వంటి పలు చర్యల ద్వారా దేశ ప్రజల్లో ఒక రకమైన విశ్వాసాన్ని చూరగొన్నారు ప్రధాన మంత్రి మోదీ.

1989 నుండి కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాల పాలనలో దేశ ప్రధాని పదవి కొంతమేరకు గౌరవాన్ని కోల్పోయింది. ఈ కాలంలో పలు దేశీయ, అంతర్జాతీయ సమస్యలు, సవాళ్లు ఉత్పన్నమైనప్పుడు మన దేశం సమర్థవంతంగా నదుచుకోకపోవడం వలన దేశ ప్రజల్లో కొంత ఆందోళన నెలకొంది. దాదాపు 12 ఏళ్లపాటు సొంత రాష్ట్రమైన గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్ర మోదీ ఆ రాష్ట్రంలో అభివృద్ధిని పరుగులెత్తించి తనకంటూ ఒక బ్రాండ్‌ను సృష్టించుకున్నారు. ఆ బ్రాండ్‌కు విశేష ప్రచారం లభించడం 2014 లోక్‌సభ ఎన్నికల్లో మోదీకి ఉపయోగపడి ఆయన ప్రధాన మంత్రి అవ్వడానికి దోహదం చేసింది.

2014-19 కాలంలో ప్రధానిగా నరేంద్రమోదీ ఒక కొత్త ఆలోచనా విధానాన్ని, పనితీరును దేశ ప్రజలకు, రాష్ట్రాధినేతలకు, రాజకీయ నాయకులకు పరిచయం చేశారు. అప్పటివరకు దేశ నాయకత్వంపట్ల ప్రజల్లో నెలకొన్న ఆందోళనకు, అభద్రత భావానికి తెరదించి వారిలో తన నాయకత్వంపట్ల నూతన విశ్వాసాన్ని కల్పించగలిగారు. ఈ ఐదేళ్లలో తన కనుసన్నలలో దేశవ్యాప్తంగా అమలైన విధానాలు, పథకాల బహుముఖ ప్రయోజనాలతో 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయేకు 2014 ఎన్నికల్లో లభించిన మెజార్టీకంటే ఎక్కువ సాధించి విజయ బావుటా ఎగురవేసి రెండోసారి దేశ ప్రధాని అయ్యారు.

ప్రధానిగా మలివిడతలో నరేంద్ర మోదీ పలు సాహసోపేతమైన చర్యలు చేపట్టారు. క్లిష్టమైన కరోనా సమయంలో దేశానికి సమర్థవంతమైన నాయకత్వాన్ని అందించడంతో పాటు పలు దేశాలకు వ్యాక్సిన్‌ను ఎగుమతి చేయగలిగారు. దేశవ్యాప్తంగా 80 కోట్ల మంది ప్రజలకు ఉచిత రేషన్ ఇచ్చారు. అది ఇప్పటికీ కొనసాగుతుంది. దశాబ్దాలుగా బీజేపీ తమ అజెండాగా చెప్పుకున్న ఆర్టికల్ 370 రద్దు, అయోధ్యలో రామ మందిర నిర్మాణాలను సాకారం చేశారు. వీటితోపాటు నూతన పార్లమెంట్ భవన నిర్మాణం పూర్తి చేయగలిగారు. ప్రపంచ దేశాల్లో 10వ స్థానంలో ఉన్న మన దేశ ఆర్థిక వ్యవస్థను 5వ స్థానానికి తీసుకురాగలిగారు.

## ప్రధానిగా మూడోసారి పక్కా..

గత పదేళ్ల విలక్షణమైన, శక్తివంతమైన, లక్ష్యపూరితమైన విజయగాథలతో నిండిన పాలన నేపథ్యంలో నరేంద్ర మోదీ మూడవసారి వరుసగా ప్రధాని కావడం తథ్యమని దేశవ్యాప్తంగా వినిపిస్తోంది. మార్చిలో ఎన్నికల ప్రకటన ముందు పలు సర్వేలు ఇదే విషయాన్ని ధృవపరిచాయి. పలు అంతర్జాతీయ సర్వే సంస్థలూ పలు ప్రముఖ ప్రపంచ నాయకుల్లో అత్యధిక ప్రజా మద్దతు నరేంద్ర మోదీకే ఉందని వెల్లడించాయి. 2014నుంచి దేశంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రాల్లో ప్రభుత్వ ఏర్పాటుకు ప్రజలు బీజేపీయేతర పార్టీలకు మద్దతిచ్చినా, కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు నరేంద్ర మోదీకి ఓట్లు వేయడం పలు సందర్భాల్లో వెల్లడైంది. ఈ ఒరవడి 2024 ఎన్నికల్లోనూ కొనసాగి నరేంద్రమోదీ 3వసారి ప్రధాని కావడం తథ్యమని పరిశీలకుల అభిప్రాయం.

అదే జరిగితే డబుల్ ఇంజన్ సర్కార్‌తో మన రాష్ట్రానికి విశేష ప్రయోజనం చేకూరుతుందని పలువురు విశ్వశిస్తున్నారు. రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో టీడీపీ -బీజేపీ -జనసేన కూటమి విజయం తథ్యం కావడంతో జగన్ ఐదేళ్ల పాలనలో విధ్వంసమైన నవ్యాంధ్ర పునర్నిర్మాణానికి మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం పెద్ద అండగా ఉంటుందని రాష్ట్ర ప్రజలు విశ్వశిస్తున్నారు. రాష్ట్రంలో తమ ఎన్నికల పర్యటన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఈమేరకు హామీ ఇచ్చి ఉన్నారు. కుదేలైన రాజధాని, పోలవరం నిర్మాణ పనులతోపాటు ఇతర అభివృద్ధి పనులకు కేంద్రం, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ పెద్దఎత్తున అండగా ఉండటం నిశ్చయం.

## ఎన్డీయే మెజార్టీ పెరిగేనా?

2014 లోక్‌సభ ఎన్నికలకంటే 2019 ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ఎక్కువ సీట్లు సాధించింది. ప్రస్తుతం లోక్‌సభలో ఎన్డీయే కూటమికి 344సీట్లు ఉంటే, అందులో బీజేపీ 303 తానే గెలుచుకుంది. వర్తమాన ఎన్నికల్లో అదే ఒరవడి కొనసాగుతుందా?

1984 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అత్యల్పంగా కేవలం 2 సీట్లు మాత్రమే గెలుచుకోకలిగింది. తరువాత 1996, 1998, 1999లలో జరిగిన ఎన్నికల్లో అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలో మూడుసార్లు కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసినా, ఎప్పుడూ స్పష్టమైన మెజార్టీ సాధించలేకపోయింది. మొదటిసారిగా బీజేపీ 2014 ఎన్నికల్లో మోదీ నాయకత్వంలో లోక్‌సభలో స్పష్టమైన మెజార్టీ సాధించింది. 2019 ఎన్నికల్లో మరింత ఘన విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది.

నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా బీజేపీ వేగంగా విస్తరించి నేడు 26 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో లోక్‌సభ సీట్లు గెలుచుకోకలిగింది.

## 2019 ఎన్నికల ఫలితాలు

గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 7 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతమైన చండీఘడ్‌లలో అన్ని లోక్‌సభ స్థానాలను గెలుచుకుంది. గుజరాత్‌లోని 26, హర్యానాలోని 10, ఢిల్లీలోని 7, ఉత్తరాఖండ్‌లోనిర్ , హిమాచల్‌ప్రదేశ్‌లోని 4 స్థానాలతోపాటు మొత్తం 57 స్థానాలను గెలుచుకుని వంద శాతం విజయాన్ని సాధించింది.

మరో 8 రాష్ట్రాల్లో మొత్తం 275 లోక్‌సభ సీట్లలో బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే కూటమి 244 స్థానాలను గెలుచుకుని 89 శాతం సీట్లను క్రైవసం చేసుకోగలిగింది. వీటిలో ఉత్తరప్రదేశ్‌లోని 80 స్థానాల్లో 64, మహారాష్ట్రలోని 48 సీట్లలో 41, మధ్యప్రదేశ్‌లోని 29లో 28, కర్నాటకలోని 28లో 26, రాజస్థాన్‌లోని 25లో 25, జార్ఖండ్‌లోని 14లో 12, ఛత్తీస్‌ఘడ్‌లోని 11లో 9 లోక్‌సభ సీట్లు ఈ కోవలో ఉన్నాయి.

వైవిధంగా అన్ని స్థానాలు, అత్యధిక స్థానాలు ఎన్డీయే కూటమి గెలుచుకున్న రాష్ట్రాల ఫలితాలను పరిశీలిస్తే 16 రాష్ట్రాల్లోని మొత్తం 332 లోక్‌సభ సీట్లలో ఎన్డీయే కూటమి 301 స్థానాలను గెలుచుకుని 91శాతం విజయాన్ని క్రైవసం చేసుకుంది. పశ్చిమ బెంగాల్, ఒడిషా, తెలంగాణ, అస్సాం, పంజాబ్ వంటి మరో పది రాష్ట్రాల్లోని 120 లోక్‌సభ సీట్లలో 43 స్థానాలను మాత్రమే గెలుచుకోగలిగింది. బీజేపీ ఇంతగా విస్తరించినా ఇప్పటికీ 91 లోక్‌సభ సీట్లతో కూడిన 10 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో బీజేపీకి ప్రాతినిధ్యం లేదు. అందులో ముఖ్యంగా తమిళనాడు (39 సీట్లు), ఆంధ్రప్రదేశ్ (25) మరియు కేరళ (20).

పై గణాంకాల ప్రకారం.. ఈ ఎన్నికల్లో బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే కూటమి లోక్‌సభలో మెజార్టీని పెంచుకోవాలంటే.. గత ఎన్నికల్లో అత్యధిక విజయాలు సాధించిన రాష్ట్రల్లో తమ పట్టు కోల్పోకుండా.. ఎక్కువ సీట్లను సాధించడానికి అవకాశమున్న ఇతర రాష్ట్రాల్లో మంచి ఫలితాలను రాబట్టాలి.

## టార్గెట్ 400

గత రెండు లోక్‌సభ ఎన్నికల్లో కూటమి ప్రదర్శన ఒరవడిని కొనసాగిస్తూ ఈ ఎన్నికల్లో 400 సీట్లు గెలవాలని ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యంగా నిర్ధారించారు. ఆమేరకు దేశవ్యాప్తంగా విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. వివిధ వర్గాల నుండి అందిన సమాచారం మేరకు గతంలో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన కొన్ని రాష్ట్రాల్లో ఎన్డీయే కూటమి కొన్ని సీట్లు కోల్పోయినా, ఇతరచోట్ల అధికంగా సీట్లు గెలుచుకునే అవకాశముంది.

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి కనీసంగా 17 లోక్‌సభ సీట్లు గెలిచే అవకాశముందని పలు సర్వేలు వెల్లడించాయి. పోలింగ్ రోజున వెల్లడైన ఓటింగ్ సరళిని పరిశీలిస్తే కూటమి కనీసంగా 22 స్థానాలను గెలుచుకోవచ్చని పరిశీలకుల అభిప్రాయం. గత ఎన్నికల్లో తెలంగాణాలోని 17 లోక్‌సభ సీట్లలో 4 స్థానాలను మాత్రమే గెలుచుకున్న బీజేపీ, ఈ ఎన్నికల్లో కనీసంగా 8 స్థానాలు గెలిచే అవకాశముందని సమాచారం. ఈ రెండు రాష్ట్రాల్లోనే ఎన్డీయే కూటమి కొత్తగా 25 లోక్‌సభ స్థానాలు సాధించే అవకాశముంది.

ప్రధానిగా నరేంద్ర మోదీకి దేశ వ్యాప్తంగా లభిస్తున్న ప్రత్యేక మద్దతుతో ఆయన మూడోసారి ప్రధాని కావడం తథ్యమని, ఈ మద్దతు ఇంకా పెరిగితే మోదీ నిర్దేశించిన లక్ష్యం సాధించే అవకాశం లేకపోలేదని.. ఏదేమైనా మోదీ 3వసారి దేశ ప్రధానిగా అధికారం చేపట్టడం నిశ్చయమని పలు సర్వేలు, పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. దీంతో డబుల్ ఇంజన్ సర్కార్ సాయంతో నవ్యాంధ్ర పునర్నిర్మాణం వేగం పుంజుకోనుంది.

చైతన్యరథం

# పిన్నెల్లి ఎస్కేప్!?



- రౌడీ ఎమ్మెల్యే క్రైం స్టోరీలో ట్విస్ట్‌ల మీద ట్విస్టులు
- శక్తిమేరకు కథ రక్తికట్టిస్తున్న ఏపీ పోలీసులు
- కొలిక్కిరాని మైండ్‌బ్లోయింగ్ హైవోల్టేజ్ సస్పెన్స్ డ్రామా
- తెరవెనుక నుంచి కథ నడుపుతున్న పాలకపక్ష పెద్దలు
- పిన్నెల్లిని తక్షణం అరెస్ట్ చేయమంటూ ఈసీ సీరియస్...
- ఈసీ ఆదేశాలతో వైసీపీ భక్త పోలీసుల్లో గుబులు
- ఎనిమిది పోలీస్ బృందాల వేట
- తెలంగాణలో 12 గంటలపాటు నాటకీయ ఫక్కీలో గాలింపు
- పిన్నెల్లి దొరికేశాడంటూ మధ్యాహ్నానికి లీకులు
- కాదు, అనుచరులే దొరికారని సాయంత్రానికి ట్విస్ట్
- ఎపిసోడ్‌పై ఎలాంటి క్లారిటీ ఇవ్వని పోలీసులు
- తప్పించారా? తప్పుకున్నాడా?.. అన్న అనుమానాలు
- పిన్నెల్లి కేసులో అడుగడుగునా వైఫల్యం, నిర్లక్ష్యం
- దర్యాప్తు పర్వంలోనూ తలెత్తుతున్న అనుమానాలు
- ఎట్టకేలకు.. 10 సెక్షన్ల కింద పిన్నెల్లిపై కేసులు నమోదు
- ఏ1గా పేర్కొంటూ 20న చార్జిషీట్‌లో మార్పులు
- దేశం దాటిపోకుండా.. లుకౌట్ నోటీసుల జారీ
- సీఇవో ద్వారా ఈసీకి నివేదిక పంపించిన డీజీపీ
- త్వరలోనే ఎమ్మెల్యేను అరెస్ట్ చేస్తామంటూ పేర్కొన్న వైనం

అమరావతి, హైదరాబాద్ (చైతన్య రథం): ఏపీలో నరాలు తెగిపోయేలా.. హైవోల్టేజ్ మైండ్‌బ్లోయింగ్ సస్పెన్స్ డ్రామా నడుస్తోంది. సాక్షాత్తూ మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వీధిరౌడీలా పోలింగ్ బూత్‌లోకి తెగబడి.. ఈవీఎం, వీవీ ప్యాట్లను ధ్వంసం చేసిన కేసు రాజకీయంగా అగ్గి పుట్టిస్తోంది. ఘటన జరిగి వారం దాటుతున్నా.. బరితెగింపు ఎమ్మెల్యేను అరెస్ట్ చేయడంలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలూ విఫలమయ్యాయి. తీవ్రమైన కేసులో ఎమ్మెల్యేపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన పోలీస్ యంత్రాంగం.. కేంద్ర ఎన్నికల సంఘం జోక్యం చేసుకునే వరకూ నిర్లక్ష్యాన్ని ప్రదర్శించడం.. పాలకపక్షం పట్ల పోలీస్ వ్యవస్థ ఎంత విధేయతతో ప్రవర్తిస్తుందో స్పష్టమవుతోంది. ఘోరమైన నేరానికి పాల్పడిన మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కళ్లముందే తిరుగుతున్నంతసేపూ ఎవ్వరూ పట్టించుకోలేదు. పిన్నెల్లి దౌర్జన్యాన్ని వెబ్‌కాస్ట్ వీడియోలో చూసి కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం సీరియస్ అవ్వడం, తక్షణం అరెస్ట్‌కు ఆదేశాలివ్వడంతో రాష్ట్రంలో హైడ్రామా మొదలైంది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మూడు చట్టాల కింద పది సెక్షన్లతో కేసులు నమోదు చేసిన పోలీసులు, ఎమ్మెల్యే పిన్నెల్లి అరెస్ట్‌కు ఉరుకులు పరుగులు పెట్టడం విడ్డూరం. ఏపీ పోలీసులు, తెలంగాణ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసుల సాయంతో ముమ్మరంగా గాలించి బుధవారం సాయంత్రం తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్ సమీపంలోని ఓ కంపెనీ గెస్ట్‌హౌస్‌లో దాక్కున్న పిన్నెల్లిని అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. అయితే, ఈ విషయాన్ని పోలీసులు అధికారికంగా ధృవీకరించడం లేదు. ఈసీ ఆదేశాలతో పిన్నెల్లి కోసం గాలింపు జల్లెడ పట్టిన ఏపీ పోలీసులు, తెలంగాణ నుంచి దేశం దాటేందుకు పిన్నెల్లి ప్లాన్ చేసుకుంటున్నట్టు సమాచారం ట్రాక్ చేయగలిగారు. ఇస్నాపూర్ లోకేషన్ ట్రాక్ చేయడానికి పటాన్‌చెరు పోలీసుల సహకారం తీసుకున్న రాష్ట్ర పోలీసులు.. బుధవారం సాయంత్రం ఎట్టకేలకు నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్టు పోలీస్ లీకులు వచ్చాయి. అయితే, బుధవారం సాయంత్రానికి పోలీస్ లీకుల్లో ట్విస్ట్ చోటుచేసుకుంది. పిన్నెల్లి డ్రైవర్ మాత్రమే దొరికాడని, పిన్నెల్లి ఇప్పటికే దేశం దాటేసి ఉండొచ్చన్న లీకులు రావడం పలు అనుమానాలకు తావిస్తోంది. పిన్నెల్లి అరెస్ట్‌పై బుధవారం సాయంత్రానికి నివేదిక ఇవ్వాలంటూ ఈసీ ఆదేశించిన నేపథ్యంలో.. రాష్ట్ర ఎన్నికల అధికారి ద్వారా ఈసీకి డీజీపి పంపిన నివేదికలోనూ పిన్నెల్లి దొరికాడా? లేదా? అన్న విషయాన్ని ప్రస్తావించక పోవడం గమనార్హం.

## ఏం జరిగింది.. ఏం జరుగుతోంది?

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజు (మే 13)న మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని రెంటచింతల మండలం పాల్వాయిగేటు (పోలింగ్ కేంద్రం 202)లో ఈవీఎం, వీవీ ప్యాట్లను మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ధ్వంసం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బూత్‌లోకి నేరుగా వెళ్లిన ఎమ్మెల్యే పిన్నెల్లి.. బహిరంగంగా ఈవీఎం, వీవీ ప్యాట్లను ధ్వంసం చేసిన ఘటన వీడియోల్లో రికార్డయ్యింది. ఏపీలో తలెత్తిన ఎన్నికల హింస నిగ్గుతేల్చేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సిట్‌ను ఏర్పాటు చేయమంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించే వరకూ.. పిన్నెల్లి వ్యవహారం బయటకు పొక్కలేదు. పోలింగ్ అనంతర పరిణామాల్లో హింస పెచ్చుమీరకుండా పోలీసులు తీసుకున్న చర్యల్లో భాగంగా –అప్పటికి పిన్నెల్లి హౌస్ అరెస్ట్‌లో ఉన్నారు. ఈసీ ఆదేశాల మేరకు సిట్ ఏర్పాటైందన్న సమాచారం తెలియడంతో.. పోలీసుల కళ్లుగప్పి పిన్నెల్లి ఎస్కేప్ అయ్యారు. ఈ విషయాన్ని గన్‌మెన్ పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చినా.. పోలీస్ బాస్‌లు ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. పాలకపక్ష పెద్దల రక్షణలోకి వెళ్లిపోయిన ఎమ్మెల్యే పిన్నెల్లి, వైసీపీ అగ్రనేతకు చెందిన సాక్షి ఛానెల్‌కు ఇంటర్వ్యూ సైతం ఇచ్చారు. మాచర్లకు అరగంట దూరంలోనే ఉన్నానని, ఎప్పుడు కావాలంటే అప్పుడు మాచర్లకు రాగలనని స్పష్టం చేసిన పిన్నెల్లి.. అప్పటినుంచీ పోలీసులకు అందుబాటులోకి రాలేదు. పిన్నెల్లి గురించి పోలీసులూ సీరియస్‌గా తీసుకున్నది కనిపించలేదు. సిట్ దర్యాప్తులో తన బండారం బయట పడుతుందన్న భయంతో హైదరాబాద్‌కు పరారైన పిన్నెల్లి.. అప్పటినుంచీ పాలకపక్ష పెద్దల రక్షణలోనే ఉన్నట్టు తెలుస్తోంది.

ఇదిలావుంటే, సిట్ నివేదిక ఈసీకి చేరడం.. ఈవీఎంను ధ్వంసం చేస్తున్న పిన్నెల్లి దురాగతం వీడియో రూపంలో బయటకు పొక్కడం, గంటల సమయంలోనే సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారానికి నోచుకోవడం.. వెరసి పరిణామాలు రాష్ట్రాన్ని ఓ కుదుపు కుదిపేశాయి. ఘటనపై ఈసీ సైతం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇంత జరిగినా.. ఇప్పటివరకూ ఎందుకు ఎమ్మెల్యేను అరెస్టు చేయలేదని రాష్ట్ర అధికారులపై విరుచుకుపడింది. పిన్నెల్లిని తక్షణమే అరెస్టు చేయాలని పోలీస్ బాస్‌లకు ఆదేశాలు జారీ చేసింది. పైగా, బుధవారం సాయంత్రం 5 గంటలలోగా నివేదిక ఇవ్వాలని కూడా కండిషన్ పెట్టింది. ఈమేరకు సీఈవో ముకేశ్ కుమార్ మీనాను ఈసీ ఆదేశించడంతో..

- (మిగతా వివరాలు 4లో)



ఈవీఎంను ధ్వంసం చేస్తున్న ఎమ్మెల్యే పిన్నెల్లి.
అడ్డుపడిన నంబూరిని 'అంతు చూస్తానని' వేలు చూపించి బెదిరిస్తున్న పిన్నెల్లి

### తప్పుకున్నారా? తప్పించారా?

మాచర్ల వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి పోలీసుల నుంచి తప్పించుకున్నాడా? పోలీసులే తప్పించారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతునాన్నయి. నిజానికి పిన్నెల్లి అరెస్ట్ ఎపిసోడ్‌లో పోలీసులు ఎలాంటి క్లారిటీ ఇవ్వకపోవడం ఈ అనుమానాలను బలోపేతం చేస్తోంది. పిన్నెల్లి దొరికాడంటూ లీకులిచ్చిన పోలీసులు.. తరువాత పిన్నెల్లి అనుచరులను మాత్రమే అరెస్ట్ చేశామంటూ సమాచారం లీక్ చేయడం వెనుక.. పాలకపక్షం పట్ల పోలీస్ విధేయతపై అనుమానాలు ముసురుతున్నాయి. అంటే, పిన్నెల్లిని అరెస్ట్ చేయకుండా ఏపీ పోలీసులు వదిలేశారన్న ప్రచారం జరుగుతుంటే, అతన్ని తప్పించడంలో తెలంగాణకు చెందిన కొంతమంది ఏపీ పోలీసులకు సహకరించారన్న సమాచారమూ గుప్పుమంటోంది. పిన్నెల్లి అదృశ్యంపై గందరగోళం కొనసాగుతున్న సమయంలోనే.. బుధవారం సాయంత్రానికి పోలీస్ లీక్ సమాచారంలో మరో ట్విస్ట్ చోటు చేసుకుంది. శంషాబాద్ ఎయిర్ పోర్టు ద్వారా పిన్నెల్లి విదేశాలకు చెక్కేశారన్న సమాచారం పోలీసుల నుంచే లీక్ కావడం. మీడియాలో ఇంత ప్రచారం జరుగుతున్నా పోలీస్ బాస్‌లు ఎలాంటి క్లారిటీ ఇవ్వకపోవడం అనుమానాలు మరింత ముసురుకుంటున్నాయి. పిన్నెల్లి అరెస్ట్ విషయంలో ఈసీ క్లారిటీ ఇవ్వాలని విపక్షాలు కోరుతున్నాయి.

### అడుగడుగునా వైఫల్యం

ఎన్నికల రోజు పాల్వాయిగేటులో ఈవీఎం ధ్వంసం ఘటనకు సంబంధించి అడుగడుగునా అధికారుల వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోందన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. పల్నాడు జిల్లా రెంటచింతల మండలం పాల్వాయిగేటు పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎం, వీవీ ప్యాట్‌లను ధ్వంసం చేసిన ఘటనలో ప్రిసైడింగ్ అధికారి నుంచి సీఈవో దాకా అన్ని స్థాయిల్లోని అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎమ్మెల్యే పిన్నెల్లి బూత్‌లోకి ప్రవేశించినపుడు, తన సీటునుంచి లేచి నిలబడి నమస్కారం చేసిన ప్రిసైడింగ్ అధికారి.. పోలీసులకు ఇచ్చిన రిపోర్టులో గుర్తు తెలియని వ్యక్తిగా ఎలా రిపోర్టు చేస్తారన్న అనుమానం రేకెత్తుతోంది. మరోపక్క పోలీసులకూ పక్కా సమాచారం ఉన్నా.. 20వ తేదీ వరకూ కేసులో పిన్నెల్లిని చేర్చిన దాఖలాలు లేవు. ఈ విషయాన్ని రాష్ట్ర ఎన్నికల అధికారి మీనా స్పష్టం చేస్తుంటే.. ఈసీకి డీజీపీ పంపిన నివేదికలో బీఎల్‌వో ఫిర్యాదు మేరకు ఈనెల 15నే పిన్నెల్లిపై కేసు నమోదు చేసినట్టు పేర్కొనడం గందరగోళం సృష్టిస్తోంది. అప్పుడే కేసు నమోదు చేస్తే.. 17వ తేదీ వరకూ పిన్నెల్లిని హౌస్ అరెస్ట్‌లో ఉంచిన పోలీసులు ఎందుకు అరెస్ట్ చేయలేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పాలకపక్షం ఆదేశాల మేరకు పిన్నెల్లిని తప్పించేలా చర్యలు తీసుకుంటూ వచ్చిన పోలీస్ యంత్రాంగం, ఈసీ సీరియస్ కావడంతో నెపం తమమీద పెట్టుకోకుండా కథ అల్లడానికి ప్రయత్నిస్తూ గందరగోళానికి గురవుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. మరోపక్క –ఈవీఎం ధ్వంసం ఘటనపై ఎన్నికల యంత్రాంగం బాధ్యత మరచిందని, ఎమ్మెల్యే దుశ్చర్యల్ని ఏ స్థాయిలోనూ అధికారులు పరిశీలించలేదన్న విమర్శలు లేకపోలేదు. ఈవీఎంలు ధ్వంసంచేసి, పౌరులపై వైసీపీ అనుచరులు దాడులు చేసినా అధికార యంత్రాంగం పట్టించుకోలేదని, ఈసీ ప్రతిస్పందించే వరకూ అధికారుల్లో చలనంలేని పరిస్థితి కనిపించిందన్న వాదన స్థానికుల నుంచి వ్యక్తమవుతోంది. కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశంతో చర్యలకు ఎట్టకేలకు రాష్ట్ర ఎన్నికల అధికారులు ఉపక్రమించారన్న వాదన వినిపిస్తోంది.

(3వ పేజీ తరువాయి)

పరిస్థితిపై అలెర్టయిన పోలీస్ బాస్‌లు రంగంలోకి దిగారు. ఈవీఎం ధ్వంసం ఘటనపై తెదేపా నేత నారా లోకేశ్ పెట్టిన ట్వీట్‌లను సైతం ఈసీ ప్రస్తావించే వరకూ రాష్ట్ర వ్యవస్థల్లో చలనం లేకపోవడం వింతల్లోకెల్లా వింత.

ఘటనపై ఈసీ తీవ్ర స్వరాన్ని గ్రహించిన పోలీసులు.. పిన్నెల్లి కోసం గాలింపు ముమ్మరం చేశారు. పల్నాడు జిల్లా ఎస్పీ అధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలు వేట మొదలెట్టాయి. అప్పటికే హైదరాబాద్ లో ఉన్నారన్న సమాచారంతో.. తెలంగాణ స్పెషల్

## పిన్నెల్లిపై అనర్హత వేటు వేయాలి: బ్రహ్మారెడ్డి

మాచర్లలో పథకం ప్రకారమే వైకాపా ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి దాడులకు పాల్పడ్డారని తెదేపా అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి ఆరోపించారు. ఈవీఎం ధ్వంసాన్ని తీవ్రనేరంగా పరిగణించి అతనిపై అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన పిన్నెల్లిని ఉపేక్షించకూడదని ఆయన విజ్ఞప్తి చేశారు.



పాల్వాయిగేటులో మొదటి నుంచి చివరి వరకు అన్ని ఘటనలకు ఎమ్మెల్యేనే బాధ్యుడన్నారు. ఈవీఎం ధ్వంసం చేస్తుండగా అడ్డుకునేందుకు ప్రయత్నించిన శేషగిరిరావుపై రౌడీలతో దాడి చేయించడం దుర్మార్గమన్నారు. పోలింగుకు ముందు, తర్వాత నియోజకవర్గంలో ఏ చిన్న ఘటన జరిగినా అందులో ఎమ్మెల్యే ప్రమేయం ఉందని ఆరోపించారు. దాడులు చేస్తామని పిన్నెల్లి ముందే చెప్పాడని, ఆ విధంగానే దాడులకు పాల్పడ్డాడని పేర్కొన్నారు. పోలీసులకు సవాల్ విసిరి, ఎన్నికల వ్యవస్థను అపహాస్యం చేసిన ఎమ్మెల్యేపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## నాకు ప్రాణభయముంది..: నంబూరి

పోలింగ్ రోజు వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి ఈవీఎంను ధ్వంసం చేస్తుంటే.. కాలర్ పట్టుకుని అడ్డంపడ్డాడు తెలుగుదేశం పార్టీ ఏజెంట్ నంబూరి శేషగిరిరావు. బూత్‌లోని ఎన్నికల సిబ్బంది, ఓటర్లు నిశ్చేష్టులై చూస్తుంటే.. తెదేపా ఏజెంట్ నంబూరి మాత్రం గుండెధైర్యంతో ఎమ్మెల్యే పిన్నెల్లి, అతని అనుచరులకు అడ్డంపడ్డాడు. అప్పటికే ఈవీఎంను ధ్వంసం చేసి వెళ్లిపోతున్న ఎమ్మెల్యే.. 'నీ అంతు చూస్తానంటూ' నంబూరిని హెచ్చరించడం వీడియోలో



స్పష్టంగా కనిపించింది. అన్నట్టుగానే అదేరోజు రాత్రి నంబూరి ఇంటిపై ఎమ్మెల్యే అనుచరులు దాడి చేసి, నంబూరిని ప్రాణం పోయేంతగా తలపై గాయపర్చారు. ప్రాణభయంతో రహస్య ప్రదేశంలో నాలుగు రోజులు తలదాచుకున్న నంబూరి.. ప్రస్తుత పరిణామాలతో బయటకు వచ్చారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధిలా కాకుండా వీధిరౌడీలా ప్రవర్తించి ఈవీఎం ధ్వంసం చేశారని పిన్నెల్లి ప్రవర్తనను వివరించారు. ఈవీఎంను ధ్వంసం చేసిన ఎమ్మెల్యేను అడ్డుకునే ప్రయత్నం చేసిన తనపై దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు, తన కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే నుంచి ప్రాణహాని ఉందని నంబూరి శేషగిరిరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఇదిలావుంటే, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చర్యను పోలింగ్ కేంద్రం బయట ఓ మహిళ సైతం నిలదీశారు. ఈ క్రమంలో పిన్నెల్లి ఆమెపై దుర్భాషలాడారు. ఇందుకు సంబంధించిన వీడియో సైతం సామాజిక మాధ్యమంలో చక్కర్లు కొడుతోంది. పిన్నెల్లి ఘటనపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# పిన్నెల్లి ఎస్కేప్!?

టాస్క్ ఫోర్స్ పోలీసుల సాయంతో ఏపీ పోలీసులు గాలింపునకు దిగారు. పిన్నెల్లి సంగారెడ్డి వైపు వస్తున్నారన్న సమాచారంతో అప్రమత్తమైన పోలీసులు.. రుద్రారం వద్ద ఆయన కారును స్వాధీనం చేసుకుని డ్రైవర్, అనుచరుని అదుపులోకి తీసు కున్నారు. అయితే సెల్‌ఫోన్ సైతం కారులోనే వదిలేసి పోలీసుల కళ్లుగప్పి పిన్నెల్లి పరారయ్యారన్న సమా చారం బయటకు పొక్కింది.

### 10 సెక్షన్ల కింద పిన్నెల్లిపై కేసులు.. లుకౌట్ నోటీసులు జారీ..

ఇదిలావుంటే, ఐపీసీ, ప్రజాప్రాతినిధ్య చట్టం, పీడీపీపీ చట్టాల పరిధిలో 10సెక్షన్లతో పిన్నెల్లిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఐపీసీ కింద 143, 147, 448, 427, 353, 452, 120బి, ఆర్పీ చట్టంలోని 131, 135 సెక్షన్లతో పిన్నెల్లిపై కేసులు నమోదయ్యా యి. ఈనెల 20నే పిన్నెల్లిపై కేసులు నమోదు చేసినట్టు పోలీసులు చెప్తున్నా, ఇంత తీవ్రమైన కేసులో పోలీసులు ఎందుకు అరెస్ట్ చేయలేదన్నది పలు అనుమానాలకు తావిస్తోంది. పిన్నెల్లి విదేశాలకు పారిపోయేందుకు యత్నిస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. దీంతో అన్ని ఎయిర్ పోర్టులను ఏపీ పోలీసులు అప్రమత్తం చేశారు. లుకౌట్ నోటీసులు సైతం జారీ చేశారు.

### ఏడేళ్ల వరకు శిక్ష పడే అవకాశం: సీఈవో ఎంకే మీనా

పోలింగ్ రోజున ఏపీలో మొత్తం 9చోట్ల ఈవీఎంలు ధ్వంసమయ్యాయని.. ఒక్క మాచర్లలోనే 7 ఘటనలు చోటు చేసుకున్నట్టు సీఈవో ముఖేశ్ కుమార్ మీనా వెల్లడించారు.



అమరావతిలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. "ఈవీఎంలను ధ్వంసం చేసిన ఘటనల స్నీ వెబ్‌కాస్టింగ్ ద్వారా పరిశీలించాం. ఈవీఎంలను ధ్వంసం చేసినా డేటా భద్రంగానే ఉంది. దీంతో కొత్త ఈవీఎంలతో పోలింగ్ కొనసాగించాం" అని వెల్లడిం చారు. అలాగే, 'ఈ ఘటనకు సంబంధించి సిట్‌కు పోలీసులు అన్ని వివరాలూ అందించారు. 20న రెంట చింతల ఎస్‌ఐ కోర్టులో మెమో దాఖలు చేశారు. మొదటి నిందితుడిగా పిన్నెల్లిని పేర్కొన్నారు. 10 సెక్షన్ల కింద పిన్నెల్లిపై కేసులు పెట్టారు. ఏడేళ్ల వరకూ శిక్షలు పడే అవకాశముంది. ఆయనను అరెస్టు చేయడానికి పోలీసు బృందాలు వెళ్లాయి. మిగతాచోట్ల కూడా కేసులు పెట్టి దర్యాప్తు చేస్తున్నాం. ఎవరినీ వదిలే ప్రసక్తి లేదు. ఈ ఘటన నమోదైన సమయంలో ఈసీ ఆదేశాలతో బదిలీలు జరిగాయి. ఈవీఎం ధ్వంసం ఘటనలో మేమేమీ దాచిపెట్టలేదు. ఘటన జరిగిన మరుసటి రోజే ఆధారాలను పోలీసులకు అప్పగించాం" అని సీఈవో స్పష్టం చేశారు. 'ఈవీఎం ధ్వంసం చేసిన ఘటనను సిగ్గుమాలిన చర్యగా ఈసీ పేర్కొంది. ఇలాంటి ఘటనలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణలో వైఫల్యంగా ఈసీ దీనిని గుర్తించింది' అని సీఈవో తెలిపారు.

### ఈసీకి డీజీపీ నివేదిక

ఈవీఎం ధ్వంసం ఘటనపై బుధవారం సాయం త్రం 5గంటలలోగా నివేదిక సమర్పించాలన్న ఈసీ ఆదేశాల మేరకు డీజీపీ హరీష్ కుమార్ గుప్తా నివేదిక పంపినట్టు



తెలుస్తోంది.రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా ద్వారా ఎన్నికల సంఘానికి డీజీపీ హరీష్ కుమార్ గుప్తా నివేదికను సమర్పించి నట్టు పోలీస్ వర్గాలు చెప్తున్నాయి.

పాల్వాయిగేటు పోలింగ్ కేంద్రంలో ఈవీఎంను ఇద్దరు అనుచరులతో కలిసి పిన్నెల్లి ధ్వంసం చేశారని డీజీపీ నివేదికలో పొందుపర్చారు. పిన్నెల్లిపై ఈనెల 15న కేసు నమోదు చేశామని, పీడీపీపీ చట్టంలోని సెక్షన్లు 448, 427 రెడ్ విత్ 34 కింద అభియోగం కింద పిన్నెల్లిని మొదటి నిందితుడిగా పేర్కొంటూ మే 20న ఎఫ్‌ఐఆర్ మార్చినట్టు డీజీపీ పేర్కొన్నారు. ఈనెల 20న పిన్నెల్లిపై మరికొన్ని సెక్షన్ల కింద అభియోగాలు నమోదు చేశామని పేర్కొంటూ, త్వరలోనే పిన్నెల్లిని అరెస్టు చేస్తామని పేర్కొనన్నారు. పిన్నెల్లి అరెస్టు కోసం 8 బృందాలు గాలిస్తున్నట్లు నివేదికలో పేర్కొన్నారు.

పిన్నెల్లి విదేశాలకు వెళ్లకుండా లుక్‌అవుట్ నోటీసులు జారీ చేశామని పేర్కొంటూ.. ఈవీఎం ధ్వంసంపై సిట్ నివేదికనూ జత చేసి సీఈవోకు పంపినట్టు తెలుస్తోంది. ఈనెల 13న మధ్యాహ్నం 12:30కు ఘటన జరి గిందని, 15న బీఎల్‌వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు పెట్టినట్టు డీజీపీ నివేదికలో పొందుపర్చారు. అందుకు -వెబ్‌కాస్టింగ్ రికార్డు దృశ్యాలను సాక్ష్యాలుగా పేర్కొ న్నారు. ఈ ఘటనలో పంచనామా చేయలేదన్న సిట్ పరిశీలనల్ని జత చేస్తూ, దర్యాప్తు అధికారి.. సాక్షుల వాంగ్మూలం తీసుకోలేదని సిట్ పేర్కొందని, 202 పోలింగ్ కేంద్రం పీవోను కూడా విచారించలేదని నివేదికలో పొందుపర్చినట్టు తెలుస్తోంది.

### డీజీపీని కలిసిన తెదేపా బృందం

ఇదిలావుంటే, తక్షణం పిన్నెల్లిని అరెస్ట్ చేయాలని తెలుగుదేశం బృందం డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తాను డిమాండ్ చేసింది. బుధవారం సాయంత్రం డీజీపీని కలిసిన తెదేపా నేతలు వర్ల రామయ్య, దేవినేని ఉమ, జూలకంటి, ఏఎస్ రామకృష్ణ తదితరులు మాచర్ల ఈవీఎం ధ్వంసం ఘటనపై డీజీపీకి ఫిర్యాదు చేశారు. పిన్నెల్లి ఈవీఎం ధ్వంసం చేసిన ఫుటేజీని డీజీపీకి అందచేసి, ఎమ్మెల్యే పిన్నెల్లిని తక్షణమే అరెస్ట్ చేయా లని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులా? అని ప్రశ్నిస్తూ.. ఒక ఎమ్మెల్యే చేయాల్సిన పనులేనా? అని నిలదీశారు. పిన్నెల్లి విధ్వంసానికి అంతులేకుండా పోయిందని, తురక కిషోర్, పిన్నెల్లి లాంటి వ్యక్తులు సమాజానికి చేటని ఈ సందర్భంగా మీడియా వద్ద వ్యాఖ్యానించారు. రాడ్లు పట్టుకుని ఎదురొచ్చిన వాళ్లపై దాడులు చేయడమే తురక కిషోర్, పిన్నెల్లి పనిగా తెదేపా నేతలు వెల్లడించారు.

### ఇతరులెవరూ సాహసించని రీతిలో చర్యలు ఉండాలి: ఈసీకి నిమ్మగడ్డ ఫిర్యాదు

మాచర్ల ఘటనపై కేంద్ర ఎన్నికల సంఘానికి ఎలక్షన్ వాచ్ కన్వీనర్ నిమ్మగడ్డ రమేశ్ ఫిర్యాదు చేశారు. ఈవీఎంలను ధ్వంసం చేసిన వీడియో దృశ్యాలను ఈసీకి అందిస్తూ... ఇలాంటి



పనులు ఇతరు లెవరూ చేసేందుకు సాహసించని రీతిలో ఎమ్మెల్యే పిన్నెల్లిపై చర్యలు ఉండాలని విజ్ఞప్తి చేశారు.

### నేడు మాచర్లకు టీడీపీ ప్రత్యేక బృందం

వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి ఈవీఎంను ధ్వంసం చేసిన ఘటనలో మరిన్ని వాస్తవాలు వెలికితీసేందుకు తెలుగు దేశం బృందం నేడు గుంటూరుకు వెళ్లనుంది. పార్టీ నేతలు వర్ల రామయ్య, నక్కా ఆనందబాబు నేతృత్వంలో టీడీపీ బృందం గుంటూరు వెళ్లి.. పిన్నెల్లి బాధితులను కలిసి ధైర్యం చెప్పనున్నారు. అదేసమయంలో బాధితు ల నుంచి ఘటనకు సంబంధించి మరింత సమాచారం సేకరించనున్నారు. పరిస్థితులను బట్టి పార్టీ బృందం మాచర్లలో పర్యటించే అవకాశం లేకపోలేదు.

- (మిగతా వివరాలు 5లో)

### పాల్వాయిగేటు పోలింగ్ బూత్ సిబ్బంది సస్పెన్షన్

మాచర్ల నియోజకవర్గంలోని పాల్వాయిగేటు పోలింగ్ బూత్ సిబ్బందిపై ఎన్నికల సంఘం వేటు వేసింది. ప్రిసైడింగ్ అధికారి (పీవో) సహా ఇతర సిబ్బందిని సస్పెండ్ చేసింది. పాల్వాయిగేటు పోలింగ్ స్టేషన్‌లో వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎంను ధ్వంసం చేసిన నేపథ్యంలో ఈసీ ఈ చర్యలు తీసుకుంది.

పిన్నెల్లి బూత్‌లోకి రాగానే పోలింగ్ సిబ్బంది లేచి నిలబడటమే కాకుండా, ఈవీఎం ధ్వంసం చేస్తున్నా అడ్డుకోకపోవడంపై ఈసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. అంతే కాకుండా ఈ ఘటనపై పీవో సరైన సమాధానం ఇవ్వలేదని తెలిపింది.

గురువారంలోగా పూర్తి వివరణ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది.



బూత్‌లోకి ఎమ్మెల్యే పిన్నెల్లి రావడంతో మర్యాదపూర్వకంగా కుర్చీల్లోంచి లేచిన ఎన్నికల సిబ్బంది.

ఇదీ పిన్నెల్లి క్రైం రికార్డు

# ఆరు హత్యలు..
# లెక్కలేనన్ని దౌర్జన్యాలు!



అమరావతి (చైతన్య రథం): పోలింగు రోజున ఈవీఎంను ధ్వంసం చేసిన కేసులో పోలీసులనుంచి తప్పించుకు తిరుగుతున్న మాచర్ల వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి క్రైం ట్రాక్ రికార్డు చూస్తే గుండెల మీద చెయ్యేసుకోక తప్పదు. పల్నాడు ప్రాంతాన్ని పిశాచిలా పట్టి పీడిస్తున్న పిన్నెల్లి సోదరుల అరాచకాలు.. ఆరు హత్యలు, లెక్కలేనన్ని దౌర్జన్యాలుగా దర్శనమిస్తున్నాయి. ఈవీఎంను పగులగొట్టినట్టు వీడియోలో స్పష్టంగా కనిపిస్తున్నా, ఇంతవరకూ ఎమ్మెల్యే పేరు చేర్చడానికి పోలీసులే మీనమేషాలు లెక్కిస్తున్నారంటే ఒకటి వైసీపీపై ఉన్న స్వామిభక్తి, రెండు పిన్నెల్లి సోదరుల పట్ల ఉన్న భయం. ఐదేళ్లుగా పిన్నెల్లి బ్రదర్స్ అరాచకాలను పైపైనే చూస్తే.. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో తోట చంద్రయ్యను నడిరోడ్డుపై పీక కోసి చంపిన ఘోరం పిన్నెల్లి బ్రదర్స్‌దే. పెళ్లికి వచ్చిన కంచర్ల జల్లయ్య ఇంటిపై అర్ధరాత్రి దాడి చేసి రాళ్లతో కొట్టి చంపిందీ వీళ్లే. దాచేపల్లి మండలం తంగెడ గ్రామంలోని బత్తుల సుబ్బులు, మాచవరం మండలం పిన్నెల్లి గ్రామంలోని ఖాదర్ భాషా, దుర్గి మండలం జంగమహేశ్వరపాడు గ్రామంలోని అరెద్దుల కోటయ్య యాదవ్, పందిటివారి పాలెం గ్రామంలోని బయలమడుగు పిచ్చయ్యల హత్యలు పిన్నెల్లి బ్రదర్స్ చేసినవే. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంలో 18చోట్ల దాడులు, దౌర్జన్యాలకు తెగబడ్డారు. ప్రత్యర్థులను బెదిరించి, దాడులు జరిపి.. మాచర్ల నియోజకవర్గంలోని 77 పంచాయతీల్లో 74 పంచాయతీలను ఏకగ్రీవం చేసుకున్నారు. మాచర్ల మున్సిపల్ ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలు ఒక్క నామినేషన్ కూడా వేయనీయకుండా హింసాత్మకంగా అడ్డుకున్నదీ పిన్నెల్లి బ్రదర్సే.

దుర్గి మండలం జంగమేశ్వరపాడు గ్రామంలో ఆవుల మల్లయ్య, కంచర్ల బక్కయ్యల కాళ్లు నరికేశారు. దుర్గి మండలం ఆత్మకూరు గ్రామంలో యలమంద రాజుపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. మాచర్ల మండలం పసుపు వేముల గ్రామంలో దోసపాటి వెంకట నారాయణను తప్పులు కేసులతో వేధించారు. దుర్గి మండలం తెర్ల గ్రామంలో అనికిపల్లి ఎలీషా బాబుపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. మాచర్ల మండలం విజయపురిసౌత్ గ్రామంలో దుర్గాప్రసాద్‌ను తప్పుడు కేసులతో వేధించారు. వెల్దుర్తి మండలం గుండ్లపాడు గ్రామంలో వేముల వెంకటేశ్వర్లుపై దాడి చేశారు. మాచరవం మండలం మోర్జపాడు గ్రామంలో కురివేపు నరసింహరావు ఆస్తి ధ్వంసం చేసి వేధింపులకు గురి చేశారు. వెల్దుర్తి మండలం గొటెపాల గ్రామంలో రాజ్యబోయిన దుర్గయ్య, పెరుమాళ్ల మల్లిఖార్జునలపై దాడి చేసి గాయపర్చారు. మాచవరం మండలం పిన్నెల్లి గ్రామంలో చింతపల్లి అస్మేన్‌పై తెదేపాకు ఓటు వేసినందుకు తీవ్రంగా వేధించారు. దుర్గి మండలం జంగమేశ్వరపాడు గ్రామంలో టీడీపీకి ఓటు వేసినందుకు గుమ్మ వెంకటేశ్వర్లు, అంజనేయులను వెంటాడి వెంటాడి వేధించారు. ఎన్నికల పనితీరును పరిశీలించేందుకు వెళ్లిన బొండా ఉమ, బుద్దా వెంకన్న, హైకోర్టు లాయర్ పారా కిశోర్‌లపై పిన్నెల్లి అనుచరుడు తురకా కిషోర్ హత్యాయత్నానికి తెగబడ్డాడు. అందుకు గిఫ్ట్‌గా తురకా కిషోర్‌కు మున్సిపల్ చైర్మన్ పదవి కట్టబెట్టారు. మాచర్ల టీడీపీ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి ఇల్లు, పార్టీ కార్యాలయంపై దాడి చేసి తగులబెట్టారు. వెల్దుర్తి మండలం గొట్టిపాళ్లలో టీడీపీ నేతలు రాచబోయిన బాబు, రవీంద్ర, శివరాజుపై వైసీపీ మూక గొడ్డలితో దాడిచేసి ఒకరి కాలు నరికేయడానికి తెరవెనుక సూత్రధారులు పిన్నెల్లి బ్రదర్సే. మాచవరం మండలం కొత్తపాలెంలో టీడీపీకి ఓటేశారనే కక్షతో దళిత వాడనే ధ్వంసం చేశారు పిన్నెల్లి బ్రదర్స్. ఇలా చెప్పుకుంటూపోతే.. పిన్నెల్లి బ్రదర్స్ అరాచకాలకు అంతే ఉండదు. ఇక -తాజా ఎన్నికల్లో పోలింగ్ బూత్ 202లో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి విచక్షణ కోల్పోయి, తన సహజ లక్షణమైన నేర సంస్కృతిలో భాగంగా ఈవీఎంను ధ్వంసం చేశాడు. వారించిన పోలింగ్ ఏజెంట్ నంబూరి శేషగిరిరావు తల పగులగొట్టారు. హత్యాయత్నం నేరం కింద అరెస్టు చేయకుండా జగన్‌రెడ్డి ప్రభుత్వం గృహ నిర్బంధంలో ఉంచడం చూస్తే.. పిన్నెల్లి బ్రదర్స్ అరాచకాలను పాలకపక్షం ఎంతగా ప్రోత్సహిస్తుందో అర్థం చేసుకోవచ్చు. తాజా ఘటనలోనూ పాలకపక్ష పెద్దల వత్తిళ్లమేరకు పోలీసులే పిన్నెల్లిని తప్పించినట్టు స్పష్టంగా తెలుస్తోంది. పోలీసుల సహకారంతో హైదరాబాద్ పారిపోయిన పిన్నెల్లి.. సాక్షి టీవీలో మాట్లాడిన మాటల వీడియో ప్రసారమవ్వడం చూస్తే.. పిన్నెల్లిని రక్షించుకోడానికి పాలకపక్ష పెద్దలు ఎంతగా కృషి చేస్తున్నారో అర్థం కాకపోదు. ఎన్నికలు ముగిసి 10 రోజులైనా ఇంకా పిన్నెల్లిని అరెస్టు చేయకపోవడమంటే ప్రభుత్వ యంత్రాంగం జవహర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏమేరకు నడుస్తుందో అర్థం చేసుకోవచ్చు.

# పిన్నెల్లి ఎస్కేప్!?

(4వ పేజీ తరువాయి)

## పిన్నెల్లి ముదిరిపోయాడు?

మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి చుట్టూ ఏపీ రాజకీయం చక్కర్లు కొడుతోంది. రౌడీ రాజకీయాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా మారిన పిన్నెల్లి, పాల్వాయి గేట్ పోలింగ్ బూత్‌లో వీధిరౌడీలా రెచ్చిపోవడం పెద్ద విషయం కాదనే అంటున్నారు. పాలకపక్ష పెద్దల ఆశీర్వాదంతో జిల్లాలోనే రౌడీ రాజకీయాన్ని నెరపుతున్న పిన్నెల్లి బ్రదర్స్.. ఎన్నో హత్యా రాజకీయాలకు తెగబడ్డారని, ఈవీఎం ధ్వంసం వాళ్లకు పెద్ద విషయమే కాదన్నట్టు మాట్లాడుతున్నారు. మొత్తం ఎపిసోడ్‌లో పోలీసులదే తప్పుగా చూపించడం వైసీపీ డ్రామాలో అంతర్భాగమని, పాలకపక్షంతో అంటకాగుతున్న జగన్‌భక్త పోలీసులను రక్షించేందుకే ఈ రసవత్తర డ్రామా అన్న విషయాన్నీ కుండబద్దలు కొడుతున్నారు.

## జగన్ సలహాతోనే పరారీ!

పోలీసులు గృహనిర్బంధంలో ఉంచిన పిన్నెల్లి మాచర్ల నుంచి పరారయ్యే ముందు ఈ నెల 17న తాడేపల్లి ప్యాలెస్‌కు వచ్చి జగన్‌రెడ్డిని కలిశాడు. పిన్నెల్లి పాల్పడిన తీవ్రమైన ఎన్నికల నేరాలకు సంబంధించి అప్పటికే సమాచారం ఉన్న తాడేపల్లి ప్యాలెస్ పెద్దలు.. ఆయనను వెంటనే అజ్ఞాతంలోకి వెళ్లిపోవాలని సూచించారు. పార్టీ ముఖ్యుల సూచన మేరకు మాచర్లలోని ఇంటిగోడ దూకేసి అదేరోజు అర్ధరాత్రి పిన్నెల్లి పరారయ్యాడు. గృహనిర్బంధంలో ఉన్న పిన్నెల్లి పరారైతే అందుకు బాధ్యులైన పోలీసులపై ఇప్పటివరకు చర్యలు మాత్రం తీసుకోలేదు.

## బయటపడుతున్న మరిన్ని అరాచకాలు

పోలింగు రోజున పిన్నెల్లి సాగించిన మరిన్ని అరాచకాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. కేపీ గూడెం పోలింగ్ కేంద్రంలో టీడీపీ ఏజెంట్‌పై పిన్నెల్లి ఆదేశాల మేరకు వైసీపీ గూండాలు హత్యాయత్నానికి పాల్పడ్డారు. టీడీపీ పోలింగ్ ఏజెంట్ రేక్యానాయక్‌పై వైసీపీ గ్యాంగు హత్యాయత్నానికి పాల్పడ్డారు. అలాగే, ఓటర్లను పోలింగ్ కేంద్రం నుంచి తరిమికొట్టి.. పిన్నెల్లి నేతృత్వంలో బూత్ క్యాప్చరింగ్‌కు వైసీపీ గూండాలు ప్రయత్నించారు. పిన్నెల్లి అరాచకాలపై టీడీపీ వర్గీయులు ఫిర్యాదు చేసినా.. పోలీసులు సైతం ఉదాశీనంగా వ్యవహరించిన అంశాలు బయటకు వస్తున్నాయి. పైగా, తమపై ఫిర్యాదు చేశారన్న ఆగ్రహంతో తెదేపా వర్గీయులపై బరిసెలతో వైసీపీ గూండాలు మూకుమ్మడి దాడులకు ప్రయత్నించినట్టు తెలుస్తోంది. భయకంపితులైన కేపీ గూడెం గిరిజనులు ప్రాణ భయంతో మిన్నకుండిపోయినట్టు వార్తలు అందుతున్నాయి.



ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చర్యను పోలింగ్ కేంద్రం బయట ఓ మహిళ సైతం నిలదీశారు. ఈ క్రమంలో పిన్నెల్లి ఆమెపై దుర్భాషలాడారు. ఇందుకు సంబంధించిన వీడియో సైతం సామాజిక మాధ్యమంలో చక్కర్లు కొడుతోంది. పిన్నెల్లి ఘటనపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# కాండక్ట్ సర్టిఫికెట్ ఇచ్చిన జగన్.. ఏమంటారో!?



ఎన్నికల ప్రచార సమయంలో 'పిన్నెల్లి అంతటి మంచివాడు, సౌమ్యుడు ఎక్కడా ఉండడం'టూ కాండక్ట్ సర్టిఫికెట్ ఇచ్చిన వైసీపీ అధినేత జగన్‌రెడ్డి.. పిన్నెల్లి దుశ్చర్యపై ఏం చెబుతారన్న ప్రశ్నలు ఉద్భవిస్తున్నాయి. 'పిన్నెల్లి నాకు మంచి మిత్రుడు, మంచివాడు. రామకృష్ణారెడ్డిని అఖండమైన మెజారిటీతో గెలిపించండి. ఇంకా పైకి తీసుకెళతాను" అంటూ మే 6న మాచర్ల ఎన్నికల సభలో ముఖ్యమంత్రి జగన్ తెగ పొగిడారు. పోలింగ్ కేంద్రంలో అరాచకానికి, దౌర్జన్యానికి దిగిన వీడియోలు బయటకు రావడం, అరెస్ట్‌కు ఎన్నికల సంఘం ఆదేశించడంతో.. 'నిజమే పిన్నెల్లి చాలా మంచోడు. ఎంత మంచోడంటే, బూత్‌లో అందరినీ భయభ్రాంతులకు గురిచేసి, ఈవీఎంలు ధ్వంసం చేసేంత? అని ప్రజలు దీర్ఘం తీస్తున్నారు. 'పిన్నెల్లి లాంటి వ్యక్తులే మీ స్నేహితులా? ఈవీఎం పగలగొట్టిన ఆయనపై చర్యలు తీసుకుంటారా? లేక మరింత పైస్థానం కల్పిస్తారా' అని జగన్‌ను సూటిగా నిలదీస్తున్నారు.

చైతన్యరథం

# పిన్నెల్లి బాధితుడు నంబూరికి చంద్రబాబు పరామర్శ



**ఫోన్‌లో మాట్లాడిన టీడీపీ అధినేత | పార్టీ అండగా ఉంటుందని భరోసా**

అమరావతి: పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం పాల్వాయిగేటు పోలింగ్ స్టేషన్‌లో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరాచకాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించి, వైసీపీ మూకల దాడిలో గాయపడ్డ బాధితుడు నంబూరి శేషగిరిరావుకు టీడీపీ అండగా ఉంటుందని పార్టీ అధినేత చంద్రబాబు భరోసా ఇచ్చారు. ఈ నెల 13న పోలింగ్ సందర్భంగా పాల్వాయిగేటు పోలింగ్ స్టేషన్‌లోకి ఎమ్మెల్యే పిన్నెల్లి అనుచరులతో కలిసి దౌర్జన్యంగా ప్రవేశించి ఈవీఎంను, వీవీప్యాట్ బాక్సును ధ్వంసం చేశారు. ఆ సమయంలో బూత్‌లో టీడీపీ ఏజెంట్‌గా ఉన్న శేషగిరిరావు.. ఎమ్మెల్యేను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఆయనను ఎమ్మెల్యే అనుచరులు తోసేశారు. తనను అడ్డుకున్న శేషగిరిరావుపై పిన్నెల్లి ఆగ్రహం వ్యక్తం చేసి, నీ అంతు తేలుస్తానంటూ వేలు చూపించి బెదిరిస్తూ వెళ్లిపోయారు. బెదిరించినట్లుగానే అదే రోజు రాత్రి శేషగిరిరావుపై ఎమ్మెల్యే, అనుచరులు దాడికి పాల్పడ్డారు. మారణాయుధాలతో దాడి చేయటంతో తలకు తీవ్ర గాయపై 14 కుట్లు కూడా పడ్డాయి. అప్పటి నుండి బాధితుడు ప్రాణ భయంతో పొలాల్లోనే ఉంటున్నాడు. పోలింగ్‌స్టేషన్‌లో ఈవీఎం ధ్వంసం వీడియో మంగళవారం వెలుగులోకి వచ్చి, కేంద్ర ఎన్నికల సంఘం ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి పిన్నెల్లిని వెంటనే అరెస్ట్ చేయాలని పోలీసులకు గట్టి ఆదేశాలు జారీచేయటంతో శేషగిరిరావు అజ్ఞాతం వీడి బయటకు వచ్చాడు. ఈ నేపథ్యంలో శేషగిరిరావుతో టీడీపీ అధినేత చంద్రబాబు బుధవారం ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. శేషగిరిరావు ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇలాఉంటే ఎమ్మెల్యే పిన్నెల్లి అరాచకాన్ని అడ్డుకుని, ప్రశ్నించిన శేషగిరిరావు పోరాటం, ధైర్యంపై సర్వత్రా ప్రశంసలు వస్తున్నాయి.



### ఈవీఎం ధ్వంసం

## ప్రజాస్వామ్యానికే మాయనిమచ్చ

**పిన్నెల్లిపై కఠిన చర్యలు తీసుకోవాలి: అచ్చెన్నాయుడు**

- పోలింగ్ తర్వాత పిన్నెల్లి మూకల అరాచకాలకు అంతే లేదు
- అడ్డదారిలో గెలిచేందుకు ప్రత్యర్థులపై దాడులు

అమరావతి(చైతన్యరథం): పోలింగ్ రోజున ఈవీఎంను బద్దలు కొట్టడం అంటే రాజ్యాంగ స్ఫూర్తిని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసినట్లేనని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. పోలింగ్ జరిగిన నాటి నుండి పల్నాడు జిల్లాలో అల్లర్లు, అరాచకాలు పెద్ద ఎత్తున చోటుచేసుకున్నాయన్నారు. మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరులు సృష్టించిన అరాచకం అంతా ఇంతా కాదు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి మాచర్లలో సామాన్యులపై వరుసగా దాడులకు పాల్పడుతూనే ఉన్నారు. ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని ప్రత్యర్థులపై పిన్నెల్లి బ్రదర్స్, వారి అనుచరులు కలిసి దాడులకు తెగబడ్డారు. పోలింగ్ రోజు వారు సృష్టించిన అరాచకాలకు ప్రజలు బెంబేలెత్తిపోయారు. ఈ అరాచకాలన్నీ పోలీసుల కనుసన్నల్లోనే జరుగుతున్నా వైసీపీ గూండాలకు అడ్డుచెప్పడం మానేసి అధికార పార్టీకి కొమ్ము కాస్తున్నారు. పోలింగ్ రోజున పిన్నెల్లి స్వయంగా ఈవీఎంను బద్దలు కొట్టడం, టీడీపీకి ఓటు వేసిన సానుభూతిపరులపై దాడులకు పాల్పడటం వంటి ఘటనలు దారుణం. వైసీపీ ఓటమి పాలవుతుందనే భయంతోనే అరాచకాలు సృష్టిస్తున్నారు. ఈ ఘటనలపై ఎన్నికల కమిషన్, పోలీసు వ్యవస్థ స్పందించి పిన్నెల్లిపై కఠిన చర్యలు తీసుకోవాలని అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు.

# పిన్నెల్లిని తక్షణం అరెస్ట్ చేయాలి

**డీజీపీని కోరిన టీడీపీ నేతలు**

- ఈవీఎం ధ్వంసంపై ఫిర్యాదు
- సీసీ కెమెరా ఫుటేజీ డీజీపీకి అందజేత
- చంద్రగిరి, తాడిపత్రి ఘటనల్లో చెవిరెడ్డి, పెద్దారెడ్డిలపైనా చర్యలు తీసుకోవాలి
- డీఎస్పీ చైతన్యనూ అరెస్ట్ చేయాలి



అమరావతి(చైతన్యరథం): పోలింగ్ రోజు దౌర్జన్యంగా పోలింగ్‌బూత్‌లోకి ప్రవేశించి ఈవీఎం ధ్వంసం చేసిన ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని తక్షణమే అరెస్ట్ చేయాలని టీడీపీ నేతలు డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం పాల్వాయి గేటు పోలింగ్‌బూత్‌లో ఈవీఎం ధ్వంసం ఘటనపై డీజీపీని కలిసి బుధవారం టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, మాచర్ల అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ.. డీజీపీని కలిసి పిన్నెల్లి ఈవీఎం ధ్వంసం చేసిన వీడియో ఫుటేజీని అందజేశారు. అనంతరం వర్ల రామయ్య మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులా.. ఇవి ఒక ఎమ్మెల్యే చేయాల్సిన పనులేనా.. పిన్నెల్లి విధ్వంసానికి అంతు లేకుండా పోయిందని మండిపడ్డారు.

మాచర్లలో ఉన్న ఎస్సైలు, సీఐలు.. పోలీస్ ఉన్నతాధికారులు ఇచ్చే ఆదేశాలను పట్టించుకునే పరిస్థితిలో లేరు. రెవెన్యూ, ఇతర అధికారులు సైతం ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అడుగుజాడల్లోనే పని చేస్తున్నారు. తురకా కిషోర్, పిన్నెల్లి లాంటి వ్యక్తులు సమాజానికి చేటు. రాడ్లు పట్టుకుని ఎదురొచ్చిన వాళ్లపై దాడులు చేయడమే తురక కిషోర్, పిన్నెల్లి పని. మాచర్లలో ప్రభుత్వ యంత్రాంగం మొత్తం పిన్నెల్లికి పాదాక్రాంతమయింది. పంచాయతీ ఎన్నికల్లో ప్రత్యర్థుల మెడమీద కత్తి పెట్టి బెదిరించి, భయపెట్టి అన్ని పంచాయతీలను ఏకగ్రీవం చేసుకున్నాడు. పోలీసుల అండతో దౌర్జన్యాలకు తెగబడ్డాడు. అంతులేని హింసకు తెరలేపాడు. ప్రశ్నించిన వారి గొంతులు కోశారు. టీడీపీ నేతలపై ఇష్టానుసారంగా దాడులు చేశారు. పోలింగ్‌బూత్‌లో ఈవీఎంను ధ్వంసం చేస్తుంటే అడ్డుకున్న టీడీపీ నేతను చంపేందుకు యత్నించారు. ప్రశ్నించిన మహిళను బూతులు తిట్టాడు. ఇలాటి రాక్షస నాయకులను వెంటనే అరెస్ట్ చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని వర్ల రామయ్య డిమాండ్ చేశారు.

చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానిపై హత్యాయత్నం చేసిన వైసీపీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆయన కుమారుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలి. తాడిపత్రిని సొంత సామ్రాజ్యంగా మార్చుకున్న వైసీపీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి.. టీడీపీ కార్యకర్తలపై దాడులు, అరాచకాలకు పాల్పడుతున్నారు. పెద్దారెడ్డిపై వెంటనే 307 సెక్షన్ కింద అరెస్ట్ చేసి శిక్షించాలి. అన్నమయ్య జిల్లా రాజంపేటలో విధులు నిర్వహిస్తున్న డీఎస్పీ చైతన్య అనంతపురం జిల్లా తాడిపత్రికి రావాల్సిన అవసరం ఏముంది. ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఆదేశాలతో టీడీపీ నాయకుడు జేసీ ప్రభాకర్‌రెడ్డి నివాసంపై దాడి చేసి పలువురిని గాయపరిచిన డీఎస్పీ చైతన్యను అరెస్ట్ చేయాలని వర్ల రామయ్య డిమాండ్ చేశారు.

# చర్చలు విఫలం.. నిలిచిన ఆరోగ్యశ్రీ సేవలు

అమరావతి: పెండింగ్ బిల్లుల చెల్లింపులపై ఆరోగ్యశ్రీ ట్రస్ట్ అధికారులు, ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ (ఆశా) ప్రతినిధుల మధ్య జరిగిన చర్చలు విఫలమయ్యాయి. దీంతో బుధవారం నుంచి తమ అసోసియేషన్‌లో సభ్యత్వం కలిగిన ఆసుపత్రుల్లో రోగులకు చికిత్స అందించడాన్ని నిలిపివేసినట్లు ఆశా స్పష్టం చేసింది. చర్చల సందర్భంగా నెట్‌వర్క్ ఆసుపత్రులకు నిధులు విడుదల చేసినట్లు ఆరోగ్యశ్రీ ట్రస్ట్ వెల్లడించింది. ప్రస్తుతం రూ.203 కోట్లు విడుదల చేశామని, పెండింగ్ బకాయిలు త్వరలో విడుదల చేస్తామని తెలిపింది. ఆరోగ్యశ్రీ సేవలకు చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించామని ట్రస్ట్ వెల్లడించింది. అయితే ప్రభుత్వం విడుదల చేసిన మొత్తం చాలా తక్కువ అంటూ ఆశా ప్రతినిధులు తమ డిమాండ్‌పై మెట్టు దిగలేదు. గత ఆగస్టు నుంచి బకాయిపడిన రూ.1,500 కోట్ల బిల్లులను వెంటనే చెల్లించకుంటే ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తామని ఆశా ప్రకటించిన నేపథ్యంలో అసోసియేషన్ ప్రతినిధులతో ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈఓ లక్ష్మీశా మంగళవారం రాత్రి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా చర్చించారు. ప్రభుత్వం బిల్లుల చెల్లింపుల కోసం చర్యలు తీసుకుంటుందని సీఈఓ చెప్పారు. గతంలోనూ ఇలాగే చెప్పినప్పటికీ బిల్లుల చెల్లింపులు జరగలేదని ప్రతినిధులు పేర్కొన్నారు. బిల్లుల చెల్లింపులకు నిర్దిష్టమైన చర్యలు కనిపించనందున బుధవారం నుంచి ఆరోగ్యశ్రీ, ఉద్యోగుల ఆరోగ్య బీమా కింద కొత్త కేసులను తీసుకునేది లేదని ఆశా యాక్టింగ్ ప్రెసిడెంట్ వై.రమేష్, ప్రధాన కార్యదర్శి సి.అవినాష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో దిగొచ్చిన ప్రభుత్వం తాత్కాలికంగా రూ.203 కోట్లు విడుదల చేసింది. బుధవారం సాయంత్రం మరోమారు ఆరోగ్యశ్రీ సీఈవోతో నెట్‌వర్క్ ఆసుపత్రులు జరిపిన చర్చలు విఫలమయ్యాయి. పెండింగ్ బకాయిలు రూ.800 కోట్లు విడుదల చేయాలని కోరగా... ప్రభుత్వం రూ.203 కోట్లు మాత్రమే విడుదల చేయడంతో ఆరోగ్యశ్రీ సేవల బంద్‌ను కొనసాగిస్తున్నట్టు ఆశా ప్రతినిధులు తెలిపారు.



చైతన్యరథం

# విధ్వంసం నుండి విధ్వంసం వరకు..!

- ప్రజా వేదిక కూల్చడంతో ప్రారంభం
- ఇప్పుడు ఈవీఎం ధ్వంసంతో ప్రజాస్వామానికి పాతర
- అన్ని వ్యవస్థలనూ విధ్వంసం చేసిన జగన్‌రెడ్డి





అమరావతి, చైతన్యరథం: అబద్ధపు ప్రచారాలతో, మోసాపు హామీలతో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి వచ్చీరాగనే విధ్వంసాన్ని మొదలుపెట్టాడు. ప్రభుత్వ ఖర్చుతో నిర్మించిన ఉండవల్లిలోని ప్రజావేదికను కూల్చి తన విధ్వంసపు పాలనను ఆరంభించాడు. కేవలం చంద్రబాబుపై కక్షతో.. ఆయనకు ఉపయోగపడకూడదనే ఏకైక లక్ష్యంతో రూ.10 కోట్ల ప్రజాధనంతో నిర్మించిన ప్రజావేదికను నిలువునా కూల్చేశాడు. తాజా జగన్‌రెడ్డికి అత్యంతఆప్తుడు అయిన మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బరితెగించి తానొక ప్రజాప్రతినిధిని అనే విషయం కూడా మర్చిపోయి ఈవీఎంని ధ్వంసం చేసి ప్రజాస్వామ్యాన్ని కూడా విధ్వంసం చేసే స్థాయికి వెళ్లిపోయారు. పిన్నెల్లిని ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం జగన్‌రెడ్డి పరిచయం చేస్తూ నాకు మంచి మిత్రుడు... చాలా మంచి వాడని చెప్పాడు. దాడులు చేయడం, హత్యలకు పాల్పడం.. ఈవీఎంలను విధ్వంసం చేయడం,అడ్డువచ్చివారి తలలు పగలకొట్టడం... బహుశా జగన్ దృష్టిలో ఇవి చాలా మంచి పనులు. పోలీసు నిర్బంధం నుండి తప్పించుకొని పిన్నెల్లి బ్రదర్స్ ఈనెల 17వ తేదీన సీఎం జగన్‌ను వచ్చి కలిశారు. ఆయన ఆశీస్సులతోనే పిన్నెల్లి పోలీసులకు చిక్కకుండా తప్పించుకు పారిపోయాడు. అంతకు తగ్గ బొంతలాగా జగన్‌రెడ్డి తననైజాన్ని పిన్నెల్లిలో చూసుకున్నాడు కాబట్టే అతనికి మంచివాడులా అనిపించాడు.ఎన్నికల్లో అత్యధిక హింస మాచర్ల నియోజకవర్గంలోనే జరిగింది. ప్రజా వేదిక విధ్వంసంతో మొదలైన జగన్‌రెడ్డి పాలన ప్రజాస్వామ్యాన్ని సైతం విధ్వంసం చేసే వరకు కొనసాగింది.

ఈ ఐదేళ్ల కాలంలో జగన్‌రెడ్డి పాలనంతా విధ్వంసంతోనే కొనసాగింది. అధికారంలోకి వచ్చి కొద్ది రోజుల్లోనే ప్రజా రాజధాని అమరావతి నిర్మాణాన్ని నిలిపేశాడు. ఆపైన మూడు రాజధానులంటూ కొత్త నాటకానికి తెరలేపి పూర్తిగా రాజధాని విధ్వంసానికి పూనుకున్నాడు. ప్రజల ఆకాంక్షలపై నీళ్లు చల్లాడు. రాజధాని రైతుల నోట్లో మట్టి కొట్టాడు. ఆంధ్ర ప్రజల కలల రాజధానిని కల్లోలంగా మార్చాడు. రాజధాని నిర్మాణం కొనసాగించిఉంటే ఇప్పుడు రాష్ట్ర ఖజానాకు అదనంగా మూడు లక్షల కోట్ల రూపాయల ఆదాయం వచ్చేది. కానీ నాశనం తప్ప అభివృద్ధి గురించి తెలియని జగన్‌రెడ్డి విధ్వంసాన్నే కొనసాగించాడు. ఆ తర్వాత రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దెబ్బతీశాడు. అభివృద్ధి మాట మరిచి, ఆస్తుల సృష్టిని వదిలేసి, ఆదాయ పెరుగుదల మార్గాలను అన్వేషించకుండా లక్షల కోట్ల రూపాయల అప్పులు చేశాడు. రాష్ట్ర అప్పులు 13 లక్షల కోట్ల రూపాయలకు చేరుకున్నాయి. ఇంతటితో ఆగక సాగునీటి రంగాన్ని కూడా జగన్‌రెడ్డి విధ్వంసం చేశాడు. ఒక్క ప్రాజెక్ట్‌ను కూడా పూర్తి చేయలేదు. కాలువల్లో పూడికలు కూడా తీయలేదు. దీంతో వరదలు వచ్చి పోలాలు మునిగి పంటలు దెబ్బతిని రైతులు పెద్దఎత్తున నష్టపోయారు. ఉన్న సాగునీటి ప్రాజెక్టల నిర్వహణ కూడా సరిగ్గా చేయకపోవడంతో అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోగా... పులిచింతల, గుండ్లకమ్మ ప్రాజెక్టుల గేట్లు కొట్టుకపోయాయి. విద్యా రంగంలో గొప్ప సంస్కరణలు చేస్తున్నామని చెప్పి పిల్లల భవిష్యత్తులో ఆడుకున్నాడు. సంవత్సరానికో రకం సిలబస్ ప్రవేశపెట్టి విద్యార్థుల్లో గందరగోళాన్ని సృష్టించాడు. పాఠశాలల క్రమబద్ధీకరణ పేరుతో మారుమూల ప్రాంతాల్లో పాఠశాలల మూసివేయడంతో బడికొచ్చే పిల్లల సంఖ్య దాదాపు 3 లక్షల వరకు తగ్గిపోయింది. మరోవైపు సంక్షేమాన్ని కూడా సంక్షోభంలోకి నెట్టాడు. బీసీ,ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అమలయ్యే దాదాపు 125కిపైగా పథకాలను రద్దుచేశాడు. బటన్ నొక్కి అరకొర డబ్బులు ఇవ్వడమే కానీ సంక్షేమం ద్వారా బడుగువర్గాలను సాధికారులను చేయాలనే విషయాన్ని మర్చిపోయాడు. ఇలా అన్ని వ్యవస్థలనూ ధ్వంసం చేసిన జగన్‌రెడ్డి చివరకు ఎన్నికల సందర్భంగా ప్రజాస్వామ్య విధ్వంసానికి పాల్పడ్డాడు. ఎటూ ఓడిపోతున్నామని తెలుకొని జగన్‌రెడ్డి, అతని బృందం అల్లర్లు సృష్టించైనా గెలవాలని ప్రయత్నించారు. ఇందుకోసం అన్నిరకాల అడ్డదారులు తొక్కారు. అందులో భాగంగానే మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బరితెగించి ఈవీఎంను ధ్వంసంచేశాడు. వీరి అరాచాకాలను ఐదేళ్ల పాటు భరించిన ప్రజలు ఈనెల 13వ తేదీన తమ ఓటు హక్కుతో బుద్ధి చెప్పారు.

## కలకత్తా హైకోర్టు సంచలన తీర్పు

### 2010 తర్వాత జారీ చేసిన ఓబీసీ సర్టిఫికెట్లు రద్దు



కోల్‌కతా: లోకసభ ఎన్నికల వేళ పశ్చిమబెంగాల్‌లో మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇటీవల ఉపాధ్యాయ నియామక కుంభకోణం కేసులో 26వేల మంది టీచర్ల ఉద్యోగాలు రద్దు చేసిన కలకత్తా హైకోర్టు బుధవారం మరో సంచలన తీర్పు వెలువరించింది. ఓబీసీలో పలు క్లాసులను కొట్టివేసింది. 2010 తర్వాత నుంచి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన అన్ని ఓబీసీ ధ్రువపత్రాలను రద్దు చేస్తూ ఉత్తర్వులిచ్చింది. 2012 నాటి పశ్చిమబెంగాల్ వెనకబడిన వర్గాల చట్టంలోని కొన్ని నిబంధనలు చట్టవిరుద్ధంగా ఉన్నాయంటూ హైకోర్టులో పిటీషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ జరిపిన ద్విసభ్య ధర్మాసనం.. 2010-12 మధ్య రాష్ట్ర ప్రభుత్వం ఓబీసీ వర్గీకరణలుగా పేర్కొన్న 42 క్లాసులను కొట్టివేస్తున్నట్లు వెల్లడించింది. ఆ వర్గీకరణలు చట్టవిరుద్ధంగా ఉన్నాయని స్పష్టంచేసింది. ఇదీ చదవండి: ప్రచారాల తీరుపై ఈసీ కన్నెర్ర. భాజపా, కాంగ్రెస్ అధ్యక్షులకు నోటీసులు అందువల్ల 2010 తర్వాత ఈ క్లాసుల కింద జారీ చేసిన ఓబీసీ సర్టిఫికెట్లన్నింటినీ రద్దు చేస్తూ తీర్పు వెలువరించింది. 1998 నాటి వెనకబడిన వర్గాల చట్టానికి అనుగుణంగా కొత్త ఓబీసీ జాబితాను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. అయితే, ఈ క్లాసులతో జారీ అయిన ఓబీసీ ధ్రువపత్రాలతో ఇప్పటికే ప్రయోజనాలు పొందుతున్నవారు, ఆ రిజర్వేషన్ల కింద ఉద్యోగాలు చేస్తున్నవారిపై ఈ తీర్పు ఎలాంటి ప్రభావం చూపదని న్యాయస్థానం వెల్లడించింది. హైకోర్టు తీర్పుపై రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అసంతృప్తి వ్యక్తంచేశారు. దీన్ని తాము అంగీకరించబోమని తెలిపారు. "ఓబీసీ రిజర్వేషన్లకు సంబంధించి ఇంటింటి సర్వే నిర్వహించి బిల్లు తీసుకొచ్చాం. రాజ్యాంగానికి లోబడి తీసుకొచ్చిన ఈ బిల్లును శాసనసభ ఆమోదించింది. ఇప్పుడు భాజపా కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించి దీన్ని నిలిపివేయాలని కుట్ర పన్నింది. ఈ తీర్పును మేం అంగీకరింబోం. ఓబీసీ రిజర్వేషన్లు కొనసాగుతాయి" అని దీదీ స్పష్టంచేశారు.

## వీడియో కాదు.. మీ బతుకే ఫేక్!

### అంబటికి అమర్‌నాథ్‌రెడ్డి కౌంటర్

అమరావతి:మంత్రి అంబటి రాంబాబుకు టీడీపీ నాయకుడు,మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎంను ధ్వంసం చేస్తున్న వీడియోను అంబటి ఫేక్ వీడియోగా చెప్పటంపై ఎక్స్‌లో అమర్‌నాథ్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. పిన్నెల్లి వీడియో ఫేక్ కాదు.. ఇన్నేళ్ల అతడిగెలుపు ఫేక్.. మీ వైసీపీ బతుకు ఫేక్.. అని అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు.

## వైసీపీ నేతల ఒత్తిళ్లు తట్టుకోలేకపోతున్నాం

### - సెలవుల కోసం ఈసీకి ఆర్వోల మొర

అమరావతి: వైసీపీ నేతల బెదిరింపులకు తట్టుకోలేక పోతున్నామని తమకు సెలవులు ఇప్పించాలని పలువురు రిటర్నింగ్ అధికారులు.. ఎన్నికల సంఘానికి మొరపెట్టుకుంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ రోజున వైసీపీ నేతలు పెద్ద ఎత్తున హింస, దౌర్జన్యాలకు పాల్పడి అటు ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులను, ఇటు ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేట, మాచర్ల, అనంతపురం జిల్లా తాడిపత్రి, తిరుపతిలో పెద్దఎత్తున వైసీపీ మూకలు హింసకు పాల్పడ్డారు. అలాగే ఎన్నికల రిటర్నింగ్ అధికారులను కూడా వైసీపీ అభ్యర్థులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. వీరి ఒత్తిళ్లు తట్టుకోలేక ఎన్నికల సంఘాన్ని రిటర్నింగ్ అధికారులు సెలవులు అడుగుతున్నట్లు సమాచారం. ఉమ్మడి రాష్ట్రం నుంచి ఎన్నో ఎన్నికలు చేశామని, ఇలాంటి పరిస్థితి గతంలో ఎప్పుడూ లేదంటున్నారు. ఒకప్పుడు బీహార్, ఇతర ఉత్తరాది రాష్ట్రాల్లో జరిగే అరాచకాలు, బెదిరింపులు ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతున్నాయంటున్నారు. ఇన్ని ఒత్తిళ్ల మధ్య తాము ఎన్నికల విధులు నిర్వహించలేమని రాష్ట్రంలోని సమస్యాత్మక జిల్లాల నుంచి రిటర్నింగ్ అధికారులు సెలవుల కోసం విజ్ఞప్తులు పంపుతున్నారు. వైసీపీ అభ్యర్థుల ఒత్తిడి తట్టుకోలేకపోతున్నామని ఈసీకి ఫిర్యాదు చేస్తున్నారు. కౌంటింగ్ రోజు వరకూ విధులు నిర్వహించే పరిస్థితి రాష్ట్రంలో లేదని మొత్తుకుంటున్నారు. ఆర్వో బాధ్యతల నుంచి తప్పించాలంటూ వేడుకుంటున్నారు. ప్రత్యేకించి రాయలసీమ నాలుగు ఉమ్మడి జిల్లాల నుంచి ఆర్వోలపై అధికార పార్టీకి చెందిన నేతలపై పెద్దఎత్తున ఒత్తిళ్లు తీసుకువస్తున్నారు. అధికార పార్టీ నేతల నుంచి వస్తున్న బెదిరింపులతో రిటర్నింగ్ అధికారులు భయాందోళనలకు గురవుతున్నారు. కేవలం ఐఏఎస్ అధికారులు మాత్రమే ఈ పత్తిళ్లను తట్టుకోగలరని ఎన్నికల సంఘాన్ని నివేదిస్తున్నారు.

## పిన్నెల్లిని అరెస్ట్ చేయాలి

- సీఎస్‌ను తొలగించాలి
- టీడీపీ అధికార ప్రతినిధి పాతర్ల డిమాండ్

అమరావతి: పోలింగ్‌బూత్‌లోకి చొరబడి ఈవీఎంను ధ్వంసం చేసిన మాచర్ల వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని వెంటనే అరెస్టు చేసి, ఎన్నికల్లో హింసకు బాధ్యుడైన సీఎస్ జవహర్ రెడ్డిని పదవి నుంచి తొలగించాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో పోలింగ్ రోజున వైసీపీ మూకలు సృష్టించిన అరాచకంపై కేంద్ర ఎన్నికల సంఘం స్పందించటంతోనే ఇక్కడి పోలీసుల్లో కదలిక వచ్చిందన్నారు. ఎన్నికల రోజు మాచర్లలో ని పాల్వాయిగేటు పోలింగ్‌బూత్‌లో ఎమ్మెల్యే పిన్నెల్లి ఈవీఎంలను ధ్వంసం చేస్తుండగా టీడీపీ ఏజెంట్ శేషగిరిరావు అడ్డుకునే ప్రయత్నం చేస్తే, పోలింగ్ తర్వాత వైసీపీ గూండాలు ఆయనపై మారణాయుధాలతో దాడి చేయడం దుర్మార్గమన్నారు. పిన్నెల్లిని వెంటనే అరెస్ట్ చేయాలని రమేష్ డిమాండ్ చేశారు. జగన్ రెడ్డి అండతో మాచర్లలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరులు ఆరు హత్యలు చేశారని, స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా లెక్కలేనని దాడులు



చేశారన్నారు.

మాచర్ల నియోజకవర్గంలో 77 పంచాయతీలు ఉంటే 74 పంచాయతీల్లో దౌర్జన్యంగా ఏకగ్రీవం చేసుకున్నాడన్నారు. మాచర్ల మున్సిపల్ ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులను నామినేషన్ కూడా వేయనీయకుండా హింసాత్మకంగా అడ్డుకున్నాడని ఆయన ఆరోపించారు, నిజ నిర్ధారణ కోసం మాచర్ల వెళ్లిన టీడీపీ నేతలు బొండా ఉమామహేశ్వరరావు, బుద్దా వెంకన్న, హైకోర్టు న్యాయవాది పారా కిషోర్‌పై హత్యాయత్నం చేసిన తురకా కిషోర్‌కు మున్సిపల్ చైర్మన్ పదవిని పిన్నెల్లి కట్టబెట్టాడని ఆరోపించారు. రాష్ట్రం జగన్ రెడ్డి ఎన్ని విధ్వంసాలు సృష్టించినా ఎన్డీఏ కూటమి ఘన విజయం ఖాయమన్నారు. తిరుపతి, మాచర్ల, తాడిపత్రి, చంద్రగిరి, సత్తెనపల్లి, గురజాల నియోజకవర్గాల్లో జరిగిన హింసాత్మక ఘటనలకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని రమేష్ కోరారు. రాష్ట్రంలో పాలనాపరంగా అన్ని విధాలుగా వైఫల్యం చెందిన సీఎస్ జవహర్‌రెడ్డికి పదవిలో కొనసాగే అర్హత లేదన్నారు. చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానిపై హత్యాయత్నం చేయించిన వైసీపీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆయన కుమారుడు మోహిత్‌రెడ్డిని ఇంతవరకు అరెస్ట్ చేయకపోవటం దుర్మార్గమన్నారు. మాచర్ల, తాడిపత్రి, తిరుపతిలో జరిగిన విధ్వంసాలపై కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని రమేష్ డిమాండ్ చేశారు.

చైతన్యరథం

# తాడిపత్రి అల్లర్లపై పోలీసుల పక్షపాతం

- బాధితులైన టీడీపీవారిపైనే కేసులు
- ఎమ్మెల్యే పెద్దారెడ్డి కనుసన్నల్లో పోలీసులు
- రాజంపేట డీఎస్పీ చైతన్యను తాడిపత్రి పంపిందెవరు
- టీడీపీ నేతలను కౌంటింగ్‌కు దూరంగా ఉంచేందుకు పోలీసుల కుట్ర
- సీఈఓకు టీడీపీ నేతలు దేవినేని, దీపక్ రెడ్డి లేఖ



అమరావతి(చైతన్యరథం): అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరిగిన అల్లర్లకు సంబంధించి పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ బాధితులైన టీడీపీ నాయకులు, కార్యకర్తలపైనే అక్రమంగా కేసులు పెట్టారని, అక్కడి టీడీపీ అభ్యర్థి అస్మిత్‌రెడ్డిని, ఆయన కుటుంబ సభ్యులను ఎన్నికల కౌంటింగ్‌కు దూరంగా ఉంచాలన్న కుట్రతో పోలీసులు వ్యవహరిస్తున్నారని టీడీపీ నేతలు మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి ఆరోపించారు. రాజంపేట డీఎస్పీ చైతన్య ఎవరి ఆదేశాలతో వచ్చి తాడిపత్రిలో టీడీపీ నేతల ఇళ్లపై దాడులకు పాల్పడ్డారో అంతుబట్టడం లేదన్నారు. ఈ విషయాలన్నీ వివరిస్తూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) ముఖేష్‌కుమార్ మీనాకు టీడీపీ నేతలు బుధవారం ఒక లేఖ రాశారు. అస్మిత్ రెడ్డి ఇంటిపై డీఎస్పీ చైతన్య దాడికి పాల్పడి వ్యక్తిగత సిబ్బంది, డ్రైవర్లు, పొరుగువారిని గాయపరిచారని తెలిపారు. తాడిపత్రి అల్లర్లలో తాను లేకపోయినా 307 సెక్షన్ (హత్యాయత్నం) కింద కేసు నమోదు చేశారని దీపక్‌రెడ్డి పేర్కొన్నారు. జూన్ 4న అస్మిత్‌రెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యులను కౌంటింగ్‌కు దూరంగా ఉంచాలన్న కుట్ర జరుగుతోందన్నారు. తాడిపత్రి పోలీసుల ఏకపక్ష చర్యను నిలువరిస్తూ టీడీపీ వారి హక్కులు రక్షించాలని సీఈసీని కోరారు. ఎన్నికల రోజున తాడిపత్రిలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఆయన కుమారుడు హింసను ప్రేరేపించడంతో పాటు పోలింగ్ బూత్ లలోకి అక్రమంగా చొరబడి ఓటర్లను భయభ్రాంతులకు గురి చేసి దాడులకు పాల్పడ్డారు. ఈ దాడుల్లో ఏఎస్పీ శ్రీరామకృష్ణతో పాటు సీఐ కూడా గాయపడ్డారు. పెద్దారెడ్డి తన అనుచరులతో టీడీపీ అభ్యర్థి జేసీ అస్మిత్‌రెడ్డి ఇంటిని చుట్టుముట్టి పోలీసులను కూడా లెక్కచేయకుండా మారణాయుధాలతో బెదిరించి, బాణసంచా కాల్చి బీభత్సం సృష్టించారు. అర్ధరాత్రి రాజంపేట డీఎస్పీ చైతన్య ఎలాంటి అనుమతి లేకుండా తాడపత్రికి వచ్చి అస్మిత్‌రెడ్డి ఇంటిపై దాడికి పాల్పడ్డారు. అస్మిత్‌రెడ్డి ఇంటి పక్కన ఉన్న సుమారు 10 ఇళ్లలో విధ్వంసం సృష్టించి 51 మందిపై ఇష్టానుసారంగా దాడి చేయడంతో పలువురు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చేరారు. డీఎస్పీ చైతన్య ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడిలో జేసీ కుటుంబ డ్రైవర్లు, వ్యక్తిగత సిబ్బందితో పాటు పొరుగువారు కూడా గాయపడ్డారు. ఎమ్మెల్యే పెద్దారెడ్డి, అయనకు పూర్తిస్థాయిలో కొమ్ముకాసే వ్యక్తిగా ముద్రపడిన డీఎస్పీ చైతన్య చేసిన ఈ దురాగతం చట్ట విరుద్ధం. ఎన్నికల కమిషన్ పర్యవేక్షణలో ఉన్న డీఎస్పీ చేసిన ఈ దుర్మార్గపు పనులు వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనం. ఈ ఘటనలకు సంబంధించి అన్ని ఆధారాలను పోలీసులు, ఎన్నికల అధికారులకు అందించినప్పటికీ ఎటువంటి న్యాయం జరగలేదు. పోలీసుల సాయంతో ఎమ్మెల్యే, అతని అనుచరులు తాడిపత్రిలో చేసిన దారుణాలు భరించలేనివిధంగా ఉన్నాయని లేఖలో తెలిపారు.

## పోలీసుల పక్షపాత వైఖరి

ఈసీ ఆదేశాలతో ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సభ్యులకు ఈ సంఘటనలు పరిశీలించి దిద్దుబాటు చర్యలు చేపట్టడానికి సమయం దొరక్క పోవడం దిగ్భ్రాంతికి గురి చేసింది. అస్మిత్‌రెడ్డి, సహచరుల ఇళ్లపై దాడులు చేయడానికి డీఎస్పీ చైతన్యకు ఎవరు ఆదేశాలు ఇచ్చారో ఈ రోజుకీ అంతుబట్టలేదు. దాడులకు పాల్పడ్డవారిపై కాకుండా బాధితులపైన కూడా కేసులు నమోదు చేశారు. నిందితులపై చట్ట ప్రకారం చర్యలు కోవాలి. జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపు రోజున జేసీ.అస్మిత్‌రెడ్డితో పాటు కుటుంబ సభ్యులు బయటకు రాకుండా చేసేందుకు పెద్దారెడ్డి ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల సమయం చేసిన అరాచకాలతో పాటు గత ఇరవై ఐదేళ్లుగా పెద్దారెడ్డి ఎన్నో క్రూరమైన నేరాలకు పాల్పడ్డాడు. ప్రత్యర్థులపై దాడులకు పాల్పడతానని మీడియా ముందే బహిరంగంగా ప్రకటించినప్పటికీ పోలీసులు నివారణ చర్యలు చేపట్టకపోవడం విచారకరం. అదే సమయంలో జేసీ ప్రభాకరరెడ్డి కుటుంబ సభ్యులను మాత్రం తాడిపత్రి నుండి వెళ్లిపోయేలా చేశారు. అనుచరులు, బంధువులపై కేసులు పెడతామని బెదిరించారు. ఎఫ్ఐఆర్‌ల్లో 90,91, 92, 94 సెక్షన్లతో పాటు 307 సెక్షన్‌ను నమోదు చేశారు. మాజీ ఎమ్మెల్సీ దీపక్ రెడ్డి ఎన్నికల రోజు, తర్వాత జరిగిన అల్లర్లలో పాల్గొనక పోయినప్పటికీ నిందితుల జాబితాలలో పోలీసులు చేర్చారు. కౌంటింగ్ రోజు దూరంగా ఉంచాలన్న కారణంతో జేసీ దివాకర్‌రెడ్డి తనయుడు పవన్‌రెడ్డి పైనా కేసులు నమోదు చేశారు. హక్కులను కాలరాయడంతో పాటు అస్మిత్‌రెడ్డి, కుటుంబ సభ్యులను పోలీసులు అక్రమంగా నిర్బంధించడం న్యాయాన్ని అపహాస్యం చేయడమే అవుతుంది. పోలీసుల ఏకపక్షంగా వ్యవహరిస్తూ జేసీ అస్మిత్‌రెడ్డితో పాటు,మద్దతుదారుల ప్రాథమిక హక్కులను హరించేలా చేస్తున్నారు.అస్మిత్‌రెడ్డితో పాటు ఆయన మద్దతుదారుల హక్కులను కాపాడాలి. పోలీసుల పక్షపాత వైఖరిని నిలువరించాలి. డీఎస్పీ చైతన్య వ్యవహారంపై విచారణ జరిపించాలని సీఈఓను దేవినేని, దీపక్‌రెడ్డి కోరారు.

## దేశం మొత్తం చూసింది: దేవినేని

అనంతరం మీడియాతో దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ తాడిపత్రిలో టీడీపీకి చెందిన వారినే ఎక్కువమందిని కేసుల్లో ఇరికించారన్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, అయన కుమారుడు ఎన్ని అక్రమాలకు పాల్పడినా పోలీసులు పట్టించుకోవటం లేదు. కిందిస్థాయిలోని పోలీసులు టీడీపీకి చెందిన వారిని 728మందిని నిందితులుగా చూపించారన్నారు. కౌంటింగ్ రోజున మళ్లీ అరాచకాలకు పాల్పడాలని చూస్తున్నారు. ఈసీ నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. తప్పుడు కేసుల్లో అమాయకులను ఇరికించొద్దు. ఐదేళ్ల క్రితం జగన్ ప్రమాణస్వీకారం చేసిననాడు దేశం మొత్తం ఏపీ వైపు చూసేలా చేస్తానని చెప్పి, అరాచక పాలనతో దానిని సాధించాడు. తెనాలిలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పోలింగ్ బూత్‌లో ఓటరును కొట్టారు... ఇది దేశం మొత్తం చూసింది. బీహార్‌లో నాడు జరిగిన ఘటనలు ఇప్పుడు ఏపీలో జరుగుతున్నాయి. సీఎస్ జవహర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల ప్రక్రియలో మాచర్ల నియోజకవర్గం పాల్వాయి గేటు పోలింగ్‌స్టేషన్‌లో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎంను ధ్వంసం చేశాడు. పోలింగ్ బూత్‌లో టీడీపీ ఏజెంట్‌పై దాడి చేశారు. ఈవీఎం పగలగొట్టినా పిన్నెల్లిపై చర్యలు తీసుకోలేదు. 13న వీఆర్వో ఫిర్యాదు ఇచ్చినా పోలింగ్ సిబ్బంది, అధికారులు ఈ ఘటనను సీఈవో దృష్టికి తీసుకురాలేదు.15న ఇచ్చిన ఫిర్యాదులో కూడా సీసీ కెమెరాలో రికార్డు అయినా గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారని చెప్పారు. పిన్నెల్లిపై 10 సెక్షన్లు పెట్టి కేసు నమోదు చేస్తే రాష్ట్రం వదిలి పారిపోయాడు. ఎమ్మెల్యేగా పోటీ చేసిన వ్యక్తి భయపడి దేశం దాటిపోవాలని చూస్తున్నాడు. ఈ రెండు సంఘటనలను జాతీయ మీడియా విస్తృతంగా ప్రసారం చేయటంతో నిజంగానే ఇప్పుడు దేశం మొత్తం ఏపీ వైపు చూస్తోందని దేవినేని ఎద్దేవా చేశారు. ఈ ఘటనలన్నింటికీ సీఎస్ జవహర్‌రెడ్డిదే బాధ్యత. ఆయన తక్షణమే బాధ్యతల నుండి తప్పుకోవాలి.

ప్రజాప్రాతినిధ్య చట్టం అమలు చేసి పిన్నెల్లిని అనర్హుడిగా చేర్చాలి. దేశంలో మరోసారి ఎవరూ ఈవీఎం లు పగలగొట్టకుండా చర్యలు తీసుకోవాలి. మంత్రులు అంబటి, జోగి ఇష్టాను సారంగా మాట్లాడుతున్నారు. అల్లర్లకు చంద్రబాబు, పురంధేశ్వరి, పవన్ కళ్యాణ్ కారణం అని సిగ్గు లేకుండా మాట్లాడారు. సాక్షిలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లపై తప్పుడు ప్రసారాలు చేస్తున్నారు. ప్రతి 500 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఒక టేబుల్ పైనే లెక్కించేలా కలెక్టర్, డీఈవోలకు ఆదేశాలు జారీ చేయాలని దేవినేని కోరారు.

దీపక్‌రెడ్డి మాట్లాడుతూ... తాడిపత్రిలో పోలింగ్ రోజుల ప్రతి 20నిమిషాలకు ఒకసారి ఎమ్మెల్యే పెద్దారెడ్డి, ఆయన కొడుకు బూత్‌ల్లోకి చొరబడి దాడులకు తెగబడ్డారన్నారు. 15 నుండి 18 ఘటనలను ఎన్నికల కమిషన్ దృష్టికి తెచ్చాము. సిట్ ద్వారా దర్యాప్తు చేస్తున్నామని చెప్పున్నారు... 91 మందిని అరెస్టు చేస్తే అందులో 51 మంది టీడీపీ వారే ఉన్నారు. తాడిపత్రి అల్లర్లకు సంబంధించి అన్ని ఆధారాలు సీఈఓకి ఇచ్చాం. అక్రమ కేసులు పెట్టిన అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలి. కౌంటింగ్ సమయంలో టీడీపీ నేతలను రాకుండా చేయాలని పెద్దారెడ్డి, పోలీసులు చేస్తున్న కుట్రలను అడ్డుకోవాలని సీఈఓను కోరామని దీపక్‌రెడ్డి చెప్పారు.

# పిన్నెల్లి నేరాలకు ఎస్సీ, ఎస్టీలు బలి

- ఇద్దరు గిరిజన మహిళలను ట్రాక్టర్‌తో తొక్కించి చంపేశారు
- దళిత బిడ్డ విక్రమ్‌ని అతి దారుణంగా హత్య చేశారు
- రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు కొండారెడ్డి ధ్వజం

అమరావతి: పల్నాడు జిల్లా మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి రెంటచింతల మండలం, పాల్వాయిగేటు వద్ద గల 202 పోలింగ్ కేంద్రంలోని ఈవీఎంను ధ్వంసం చేయడం ఆయన నేర ప్రవృత్తికి పరాకాష్ట అని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు డాక్టర్ కొండారెడ్డి నరహరిప్రసాద్ ధ్వజమెత్తారు. మాచర్లలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఒక మాఫియా గ్యాంగ్ నడుపుతూ అరాచకాలు, దాడులు, హత్యలకు పాల్పడ్డారని విమర్శించారు. గత ఐదేళ్లలో పిన్నెల్లి మాఫియా సాయంతో వేలాది కోట్లు అక్రమ సంపాదన కూడబెట్టి, ఆ డబ్బుతో ఎన్నికల్లో గెలవాలని ప్రయత్నించారని ఆరోపించారు. పిన్నెల్లి నేరాలకు సామాన్య ప్రజలతో పాటు దళిత, గిరిజనులు సైతం బలైపోయారు. రెంటచింతల మండలం, మల్లవరం గ్రామంలో తాగునీరు ఇవ్వాలని అభ్యర్థించిన గిరిజన మహిళ సామణిబాయిని పిన్నెల్లి అనుచరుడు అతి దారుణంగా ట్రాక్టర్‌తో తొక్కించి చంపాడు. నకరికల్లు, శివాపురం తండాలో అప్పు తీర్చలేదని రమావత్ మంత్రూబాయిని హత్య చేశారు. తెలుగుదేశం పార్టీలో క్రియాశీలంగా పనిచేస్తున్నాడనే కారణంతో విక్రమ్ దోమతోటి అనే దళిత యువకుడిని విచారణ పేరుతో పిలిపించి హత్య చేశారు. గత ఐదేళ్లలో పిన్నెల్లి సోదరులు దళిత, గిరిజనులపై పదుల సంఖ్యలో దాడులకు పాలపడ్డారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో దళిత, గిరిజనులు తెలుగుదేశం పార్టీకి మద్దతు పలికారని అనేక గ్రామాల్లో తాగునీరు కూడా నిలుపుదల చేయించిన నీచ చరిత్ర పిన్నెల్లిది.



ఈ నెల 13న జరిగిన ఎన్నికల్లో పల్నాడు జిల్లాలో, ముఖ్యంగా మాచర్లలో పోలీసులు, ఎన్నికల అధికారులు పూర్తిగా వైఫల్యం చెందారు. 15 మంది తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులపై దాడిచేసి చంపాలని పిన్నెల్లి గ్యాంగ్ ప్రయత్నించింది. దీనిపై వెంకటేష్ నాయక్ అనే టీడీపీ కార్యకర్త ఫిర్యాదు చేసినా పోలీసులు ఉదాశీనంగా వ్యవహరించారు. పిన్నెల్లి పోలింగ్ రోజున ఈవీఎంను ధ్వంసం చేస్తే..పాల్వాయిగేటు వద్ద ఎన్నికల విధులు నిర్వహించిన అధికారులు ఎందుకు ఆ విషయాన్ని కెమెరా ఫుటేజీని పోలీసులకు అందజేసినా పిన్నెల్లిపై నేటికీ ఎందుకు చర్యలు తీసుకోలేదు. ఈవీఎం ధ్వంసానికి సంబంధించిన సీసీ కెమెరా ఫుటేజీ మరుసటి రోజే సీఈఓకు తెలిసినా సిట్ అధికారులు బయటపెట్టేంత వరకు ఎందుకు మీడియాకు తెలియజేయలేదు? ఇది అధికారపక్ష నేతలను కాపాడటం కాదా? ఇప్పటికైనా బాధితులు ఇచ్చిన ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని పిన్నెల్లిపై చర్యలు తీసుకోవాలి. ఈవీఎంను ధ్వంసం చేసి ఎన్నికలను, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని వెంటనే అరెస్టు చేయాలి. పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని శాశ్వతంగా ఎన్నికల నుంచి బహిష్కరించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఎన్నికల సంఘాన్ని కొండారెడ్డి డిమాండ్ చేశారు.

# అరాచకాలకు కేరాఫ్ అడ్రస్ పిన్నెల్లి బ్రదర్స్

- ఒక్కొక్కటిగా బయటకు వస్తున్న వారి అకృత్యాలు
- పిన్నెల్లికి సహకరిస్తున్న వారిపై సైతం చర్యలు తీసుకోవాలి
- డిమాండ్ చేసిన గుంటూరు జిల్లా బీసీ విభాగం టీడీపీ నాయకులు



గుంటూరు (చైతన్యరథం) : అరాచకాలకు కేరాఫ్ అడ్రస్ గా పిన్నెల్లి మారారని, ఈవీఎం మిషన్లు ధ్వంసం చేయడం పిన్నెల్లి దుర్మార్గానికి పరాకాష్ట అని గుంటూరు జిల్లా బీసీ విభాగం అధ్యక్షులు వేములకొండ శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. ఎన్నికల అనంతరం రాష్ట్రంలో చోటుచేసుకున్న హింసను ఖండిస్తూ... అపహాస్యమైన ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరుతూ బుధవారం గుంటూరు జిల్లా టీడీపీ బీసీ విభాగం ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం గుంటూరు జిల్లా బీసీ విభాగం అధ్యక్షులు వేములకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ... పోలింగ్ రోజున మాచర్ల నియోజకవర్గం పాల్వాయిగేట్ గ్రామంలోని 202 పోలింగ్ కేంద్రంలో బీభత్సం సృష్టించి ఈవీఎం మిషన్లు బద్దలు కొట్టడమే కాకుండా ప్రశ్నించిన టీడీపీ ఏజెంట్‌పై దాడికి పాల్పడ్డారని, ఇంత జరుగుతున్నా అక్కడి పోలీసులు ఇప్పటి వరకు పిన్నెల్లిపై కేసు నమోదు చేయకపోగా... అతను తప్పించుకుని పారిపోయే అవకాశం కల్పించారని మండిపడ్డారు. ఘటన జరిగిన వారం రోజులు తర్వాత బయటకు వచ్చిన వీడియోల ఆధారంగా విధిలేని పరిస్థితుల్లో పెన్నెల్లిపై పోలీసులు కేసు నమోదు చేశారని అన్నారు. ఎన్నికల అనంతరం మాచర్లలో చోటుచేసుకున్న అల్లర్ల వెనుక పెన్నెల్లి బ్రదర్స్ హస్తం ఉందని, ఈ వ్యవహారంలో అధికారులు సైతం పెన్నెల్లి రామకృష్ణారెడ్డికి సహకరించిన వారిపై సైతం చర్యలు తీసుకోవాలని వేములకొండ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గడిచిన ఐదేళ్లుగా నియోజకవర్గంలో పిన్నెల్లి సోదరులు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలపై దాడులకు పాల్పడుతూ అరాచకం సృష్టించారని మండిపడ్డారు. స్థానిక ఎన్నికల సమయంలో తోట చంద్రయ్యను నడిరోడ్డుపై పీకకోసి చంపారని, కంచర్ల జల్లయ్య ఇంటిపై అర్ధరాత్రి దాడి చేసి నరికి చంపారని తెలిపారు. ఎన్నికల పనితీరును పరిశీలించేందుకు వెళ్లిన బొండా ఉమా, బుద్దా వెంకన్న, హైకోర్టు లాయర్ పారా కిశోర్లపై పిన్నెల్లి అనుచరుడు తుర్కా కిషోర్ హత్యాయత్నానికి తెగబడ్డారని అన్నారు. మాచర్ల టీడీపీ ఇన్‌ఛార్జ్ జూలకంటి బ్రహ్మారెడ్డి ఇళ్లు, పార్టీ కార్యాలయాలపై దాడులకు తెగబడటం కాకుండా... పెన్నెల్లి అనుచరుడైన చల్లా మోహన్ అనే వ్యక్తి కత్తిపట్టుకుని వీరంగం సృష్టించినా కేసు నమోదు చేయలేదన్నారు. పల్నాడు ప్రాంతాన్ని పిశాచిలా పట్టి పీడిస్తున్న పిన్నెల్లి సోదరుల అరాచకాలకు ఇకనైన ముగింపు పలకాలని ఈసీని వేములకొండ శ్రీనివాస్ కోరారు.

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మద్దిరాల ఇమ్మానుయేల్ మాట్లాడుతూ... పల్నాడులో పోలింగ్ రోజు, అనంతరం జరిగిన హింసను ఎమ్మెల్యే పిన్నెల్లి ప్రోత్సహించాడని, మాచర్ల నియోజకవర్గం రెంటచింతల మండలం రెంటాలలో టీడీపీ ఏజెంట్లు, సానుభూతిపరులపై కర్రలు, కొడవళ్లతో దాడికి పాల్పడిన అధికారులు ఇంత వరకు చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. 'ఏకంగా పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పోలింగు బూత్‌లోకి చొరబడి ఈవీఎం, వివిప్యాట్‌ను పగులగొట్టాడు... వేలాది మంది ఓటర్లు, పోలింగ్ అధికారులు, పోలీసు సిబ్బంది చూస్తుండగానే ఈవీఎం పగులగొట్టినా పిన్నెల్లిపై కేసు పెట్టలేదు. ఎన్నికలు పూర్తయిన పది రోజుల తర్వాత వీడియో బయటకు రావడంతో ఇప్పుడు నాటి ఎఫ్ఐఆర్లో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పేరు చేర్చడం పోలీసుల దుర్మార్గానికి నిదర్శనం.' అని మద్దిరాల ఇమ్మానుయేల్ అన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా బీసీ విభాగం ప్రధాన కార్యదర్శి మాదాల చినకొండలరావు, జిల్లా బీసి విభాగం కార్యనిర్వాహక కార్యదర్శులు గట్టి శ్రీనివాసరావు, సూరె శ్రీనివాసరావు, జంపని నాగేశ్వరరావు, పామర్తి మోహనరావు, కదిరి ఈశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

## పరిటాల ఇంటి వద్ద పది రోజులైనా తగ్గని నేతల సందడి

- ప్రతిరోజు వందలాది మంది నాయకులు కార్యకర్తలు ఇంటి వద్దకు రాక
- మనం గెలవబోతున్నామంటూ ధీమా వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు
- ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తున్న మాజీ మంత్రి పరిటాల సునీత



రాప్తాడు (చైతన్యరథం): ఎన్నికల పోలింగ్ ముగిసి పది రోజులైనా మాజీ మంత్రి పరిటాల సునీత క్యాంపు కార్యాలయం వద్ద ఏమాత్రం సందడి తగ్గడం లేదు ప్రతిరోజు వందలాదిమంది కార్యకర్తలు నాయకులు పరిటాల ఇంటి వద్దకు వచ్చి మనం గెలవబోతున్నామంటూ సంతోషాన్ని వ్యక్తపరుస్తున్నారు. మాజీ మంత్రి పరిటాల సునీత, ధర్మవరం ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ నేతలందరినీ ఆప్యాయంగా పలుకరిస్తున్నారు. బుధవారం రోజు కూడా వివిధ మండలాల గ్రామాలకు చెందిన నాయకులు పెద్ద ఎత్తున తరలి రావడంతో వెంకటాపురంలో సందడి వాతావరణం నెలకొంది నేతలందరితో గ్రామాల వారీగా పరిటాల సునీత సమావేశం నిర్వహించారు. మీ ప్రాంతాల్లో ఎన్నికలు ఎలా జరిగాయి. పోలింగ్ సమయంలో ఏమైనా ఇబ్బందులు ఎదురయ్యాయా..? వంటి అంశాల గురించి తెలుసుకున్నారు. ప్రతి గ్రామంలోనూ ఖచ్చితంగా మెజార్టీ వస్తుందని వారు పరిటాల సునీతతో అన్నారు. ఎన్నికలు ముగిసాయి కాబట్టి ప్రశాంతంగా ఉండాలని.. గ్రామాల్లో ఎలాంటి కక్షలు కార్పన్యాలకు పోవద్దని ఆమె సూచించారు. వైసిపి నాయకులు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తుంటారని ఇలాంటి వాటి గురించి ఎవరూ పట్టించుకోవద్దన్నారు. మీ గ్రామాల్లో మీ సొంత పనులు చేసుకుంటూ కుటుంబ సభ్యులతో సంతోషంగా ఉండాలని ఆమె అన్నారు. కచ్చితంగా మీ గ్రామాలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని హామీ ఇచ్చారు.

## కేశినేని శివనాథ్‌ను కలిసిన తిరువూరు పార్టీ నాయకులు

- కౌంటింగ్ రోజున అప్రమత్తంగా ఉండాలని సూచన

విజయవాడ (చైతన్యరథం): గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో తిరువూరు నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకులు బుధవారం టీడీపీ విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేశినేని శివనాథ్ మాట్లాడుతూ... తిరువూరులో జరిగిన ఎన్నికల సరళి గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే కౌంటింగ్ రోజు కూడా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు కేశినేని శివనాథ్ ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా తెలుగు రైతు సంఘం అధ్యక్షుడు చెరుకూరి రాజేశ్వరరావు, గంపలగూడెం మండలపార్టీ అధ్యక్షుడు రేగళ్ల వీరారెడ్డి, ఎ.కొండూరు మండలపార్టీ అధ్యక్షుడు గద్దె కృష్ణారెడ్డి, తిరువూరు రూరల్ పార్టీ అధ్యక్షుడు వెంకట నరిసిరెడ్డి, తిరువూరు పట్టణ పార్టీ అధ్యక్షుడు బొమ్మసాని మహేష్, గంపలగూడెం క్లస్టర్ ఇన్‌ఛార్జ్ రజనీకాంత్, సీనియర్ నాయకులు కిలార్ రమేష్, గద్దె వెంకన్న జయసింహాలతో పాటు తదితరులు పాల్గొన్నారు.



## ఆరోగ్యశ్రీ నిలుపుదలపై ఈసీ స్పందించాలి

- రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ



జగ్గంపేట (చైతన్యరథం) : రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్యశ్రీ వైద్య సేవలు నిలుపుదల ప్రకటనపై ఎలక్షన్ కమిషన్ తక్షణం స్పందించాలని రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ అన్నారు. మంగళవారం జగ్గంపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నెహ్రూ మాట్లాడారు. ఆరోగ్యశ్రీ సేవలు నిలుపుదల చేస్తున్నట్లు నెట్వర్క్ ఆసుపత్రుల యాజమాన్యం తెలపడం బాధాకరమన్నారు. దాదాపు 1500 కోట్లు బకాయిలు ఉండిపోవడంతో వారు సేవలు నిలుపుదల చేస్తామంటున్నారు. ఆరోగ్యశ్రీ పథకం పేదలకు ఎంతో ముఖ్యమని దాన్ని కొనసాగించడం ఎంతో అవసరమన్నారు. ఎన్నికల ఫలితాలకు ఇంకా పది రోజులు పైగా సమయం ఉండడంతో ఇటువంటి తరుణంలో నెట్వర్క్ ఆస్పత్రులు మానవతా దృక్పథంతో ఆలోచించి సేవలు కొనసాగించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు వాయిదాల్లో పెండింగ్ బకాయిలు చెల్లిస్తామని నెహ్రూ పేర్కొన్నారు. సమావేశంలో ఎస్వీఎస్ అప్పలరాజు, కొత్త కొండబాబు, కందుల బాబ్జి, సూతి శ్రీను, మంచి కంటి శ్రీను, పాలిశెట్టి సతీష్, తదితరులు ఉన్నారు.

## చంద్రబాబును ఓడించడం వైసీపీ తరం కాదు !

- టీడీపీ నేత ఎన్.బి సుధాకర్ రెడ్డి ధీమా



కుప్పం (చైతన్యరథం): టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడును కుప్పంలో ఓడించడం వైసీపీ తరం కాదని, ఏడుసార్లు వరుసగా గెలిచిన చంద్రబాబు... ఎనిమిదవ సారి గెలిచి రికార్డు నెలకొల్పడం ఖాయమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.బి సుధాకర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన చిత్తూరులో మీడియాతో మాట్లాడుతూ... కొంత మంది వైసీపీ నాయకులు కుప్పంలో చంద్రబాబునాయుడు ఓడిపోతారంటూ గ్లోబెల్ ప్రచారం చేసి సునకానందం పొందుతున్నారని ఎద్దేవా చేశారు. ఏడు సార్లు వరుసగా గెలిచిన చంద్రబాబు.. ఎనిమిదవ సారి గెలిచి రికార్డు నెలకొల్పడం ఖాయమని, తిరిగి సీఎం పదవి చేపట్టి రాష్ట్రాన్ని సంక్షేమాభివృద్ధిలో ముందుకు నడిపిస్తారని అన్నారు. చంద్రబాబు 1989లో తొలిసారిగా కుప్పం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి 6,918 ఓట్ల మెజారిటీ సాధించారని, 1994 ఎన్నికల్లో 56,888 ఓట్ల మెజారిటీ తెచ్చుకున్నారని అన్నారు. అలాగే 1999లో 65,687 ఓట్లు, 2004లో 59,588 ఓట్లు, 2009లో 46,066 ఓట్లు, 2014లో 47,121 ఓట్లు, 2019లో 30,722 ఓట్ల మెజారిటీ సాధించారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ వారు పోలీసులను అడ్డుపెట్టుకొని అక్రమాలకు పాల్పడి మెజారిటీ స్థానాలు తెచ్చుకున్నారని సుధాకర్ రెడ్డి విమర్శించారు. అప్పటి వాపును చూసి వైసీపీ నేతలు బలుపని భ్రమపడటం మానుకోవాలన్నారు. రాష్ట్రంలో టీడీపీ అత్యధిక మెజారిటీ సాధించి అధికారం చేపడుతుందని సుధాకర్‌రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మెజారిటీ స్థానాలు వస్తాయని సుధాకర్ రెడ్డి వెల్లడించారు.

# రాష్ట్రంలో రాబోయేది ఎన్డీఏ ప్రభుత్వమే !

- ఎన్డీఏ కూటమికి 130 కి పైగా సీట్లు వస్తాయని తేల్చిన అన్ని సర్వేలు
- జూన్ 4 వరకు ఈవీఎమ్ ల రక్షణ బాధ్యత పోలీసులదే
- నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ



పెనుకొండ (చైతన్యరథం): వైసీపీ పాలన తో విసిగిపోయి, చంద్రబాబు నాయకత్వం ఈ రాష్ట్రానికి అవసరమని భావించి యువత, మహిళలు అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటు వేశారని పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ అన్నారు. రాష్ట్రంలో రాబోయేది ఎన్డీఏ ప్రభుత్వమేనని.. కూటమికి 130 కి పైగా సీట్లు వస్తాయని అన్ని సర్వేలు తేల్చిచెప్పాయని ఆమె అన్నారు. సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అంజినప్ప పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలలో చేసిన దౌర్జన్యాలు, అరాచకాలు సార్వత్రిక ఎన్నికలలో కొనసాగించి గెలుపు సొంతం చేసుకోవాలని వైసీపీ నాయకులు విఫల ప్రయత్నం చేశారన్నారు. ఎన్నికలు సాధ్యమయినంత మేర సజావుగా జరిగేందుకు సహకరించిన అధికారులకు, మీడియా మిత్రులకు, ఓటర్లకు ధన్యవాదములు తెలిపారు.

సత్యసాయి జిల్లాల్లో ఏడు నియోజకవర్గాలతో పాటు ,పార్లమెంట్ ఎంపీ స్థానం కూడా గెలవబోతున్నాం. గత ఐదేళ్ల భయాందోళనలతో పని చేసిన అధికారులు ఇప్పుడు ఒక బాధ్యతగా వ్యవహరించారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం శ్రమించారు. ఎన్డీఏ కూటమికి దాదాపు 130 సీట్లు రాబోతున్నాయి. ఎన్నికలకు ముందు వై నాట్ 175 అని చెప్పుకున్న వైసీపీ ఇప్పుడు కనీసం 75 సీట్లు వస్తాయని చెప్పుకునేందుకు వెనుకాడుతోంది. జగన్‌కు షాక్ అయ్యేలా ఫలితాలుంటాయి. ప్రజలు ఏకపక్షంగా కూటమి వైపు మొగ్గుచూపినట్లు తెలుస్తోంది. కేడర్ జారిపోకుండా వైసీపీ మైండ్ గేమ్ ఆడుతోందన్నారు .పిన్నెల్లి రామకృష్ణ ఈవీఎం ధ్వంసం చేయడం చూస్తుంటే వాళ్ల ఫ్రస్ట్రేషన్ అర్థమవుతుంది. జూన్ 9న సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేయబోతున్నారని సత్యసాయి జిల్లాకు మరిన్ని పరిశ్రమలు తాగునీటి ,సాగునీటి ,ప్రాజెక్ట్ లు మరిన్ని తీసుకువస్తామని జిల్లాను మరింత అభివృద్ధిగా చేస్తామని సత్యసాయి జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప ,పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీమతి సవితమ్మ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు మాధవ నాయుడు,మాజీ జడ్పీటీసీ వెంకట రమణ, మాజీ జడ్పీటీసీ శ్రీనివాసులు, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు అంజినేయులు, జిల్లా కార్యదర్శి నీరుగంటి చంద్ర శేఖర్, శ్రీనివాస రెడ్డి, పద్దీ శ్రీనివాసులు, చిన్నపోతన్న, వీర చిన్న,ఆవుల అంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

# సమాజ సంక్షేమం కోసమే సేంద్రీయ వ్యవసాయం

- ఆదర్శరైతు వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించిన ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు



నల్గొండ (చైతన్యరథం): తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లా నకిరేకల్ మండలం చందంపల్లి గ్రామంలో కొరిటాల వెంకట గౌతమ్ ఆధ్వర్యంలో పూర్తి సేంద్రియ పద్ధతిలో ఎకరానికి 400 మొక్కల చొప్పున సాగుచేస్తున్న మామిడి పంటను టీడీపీ సీనియర్ నేత ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు, ప్రముఖ డ్రాగన్‌ఫ్రూట్ రైతు తుమ్మల ఉదయ్ తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు మాట్లాడుతూ... గోఆధారంగా పంచగవ్య, జీవామృతం, ఘనామృతం, వర్మీ కంపోస్ట్ తదితర పద్ధతులు ఉపయోగించి 30 ఎకరాలలో ఈ మామిడి రకాలను సాగు చేస్తున్నారని అన్నారు. నీటి వృథాను అరికట్టి తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు పండించటం భావితరాలకు ఆదర్శమని, మరియు వినూత్నతన పద్ధతిలో ఒకే తల్లిమామిడి చెట్టుకు గ్రాఫ్టింగ్ చేసి 5రకాలైన బంగినపల్లి, చిన్నరసం, కేసర, సువర్ణరేఖ, చెరుకురసం తదితర మామిడి కాయలను కాయించటం మేం గమనించామని ఇది రైతు చరిత్రలో కొత్త అధ్యాయమని అన్నారు.

మామిడి పండ్లను ఏవిధమైన పురుగుమందుల అవశేషాలు లేకుండా తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లోని వినియోగదారులకు స్వచ్ఛమైన మామిడిపండ్లను ఎటువంటి కార్బైడ్ లేకుండా రెండురోజుల్లో సహజ సిద్ధంగా పండేవిధంగా 5 కేజీలు 500రూపాయలకే అందించటం గొప్పవిషయమని అన్నారు. సమాజ సంక్షేమం కోసమే సేంద్రీయ వ్యవసాయం చేపట్టాలని ఆళ్ళ గోపాలకృష్ణారావు వ్యాఖ్యానించారు. రైతులకు ఆదర్శంగా నిలిస్తున్న కొరిటాల వెంకట గౌతమ్ సలహాలు తీసుకుని రైతులు అధికశగా సేంద్రీయ వ్యవసాయాన్ని చేపట్టాలని కోరారు.

# పిన్నెల్లిపై శాశ్వత నిషేధం విధించాలి

- ఓటమి భయంతోనే ఈవీఎంల ధ్వంసం, దాడులు
- పిన్నెల్లి సోదరులకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి
- డిమాండ్ చేసిన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ



గుంటూరు (చైతన్యరథం): ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేసిన వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని శాశ్వతంగా ఎన్నికల్లో పోటీ చేయకుండా అతనిపై నిషేధం విధించేలా ఈసీ కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ నేత మన్నవ మోహనకృష్ణ కోరారు. అరాచకాలకు కేరాఫ్ అడ్రస్ అయిన పిన్నెల్లి బ్రదర్స్ పోలింగ్ రోజున బీభత్సం సృష్టించి ఈవీఎంలను బద్దలు గొడితే... గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ఈవీఎంలు ధ్వంసం చేశారంటూ ఇప్పటి వరకు పోలీసులు కేసులు నమోదు చేయడం దుర్మార్గమన్నారు. ఎన్నికలు పూర్తయిన పదిరోజుల తర్వాత వీడియో బయటకు రావడంతో ఇప్పుడు నాటి ఎఫ్ఐఆర్‌లో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పేరు చేర్చడం పోలీసుల దుర్మార్గానికి నిదర్శనమన్నారు. ఇప్పుడు కూడా సిట్ అధికారులు వచ్చి సీసీ ఫుటేజి పరిశీలించడంతో అసలు విషయం బయటకొచ్చిందని, పిన్నెల్లి అరాచకానికి సహకరించి, కేసులు పెట్టకుండా వదిలేసి... నామమాత్రపు కేసులతో చేతులు దులుపుకున్న పోలీస్ అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని మోహనకృష్ణ డిమాండ్ చేశారు.

సీఈసీ నుంచి ఆదేశాలు వస్తే కానీ అరెస్ట్ చేయాలనే కనీస స్పృహ రాష్ట్రంలోని అధికారులు, పోలీసులకు లేకపోవడం విచారకరమన్నారు. మే 13వ తేదిన మాచర్ల నియోజకవర్గం, రెంట చింతల మండలం, పాల్వాయిగేటు గ్రామం లోని పోలింగ్ బూత్‌లోకి అక్రమంగా చొరబడిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డి... ఈవీఎం మిషన్ బద్దలుగొడితే... వీడియో బటకొచ్చే వరకు కేసు పెట్టకపోవడం పోలీసుల నిర్లక్ష్యమే నన్నారు. పోలీసులకు పిన్నెల్లి అంటే ఎవరో తెలియదా? లేక పిన్నెల్లి అరాచకానికి మడుగులొత్తే ప్రయత్నమా? అని ప్రశ్నించారు. ఈమేరకు బుధవారం గుంటూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో మన్నవ మోహనకృష్ణ మీడియాతో మాట్లాడుతూ... హౌస్ అరెస్టులో ఉండగా పిన్నెల్లి సోదరులు ఎలా తప్పించుకున్నారు? పారిపోతుండగా పోలీసులు ఏం చేస్తున్నారని నిలదీశారు. అధికారంలోకి వచ్చిన మొదలు గడిచిన ఐదేళ్లుగా మాచర్లలో పిన్నెల్లి సోదరుల అరాచకాలకు అంతులేకుండా పోయిందని, నాడు స్థానిక సంస్థల ఎన్నికల నుంచి... నేటి సార్వత్రిక ఎన్నికల వరకు మాచర్ల ప్రాంతాన్ని పిశాచిలా పట్టిపీడిస్తున్న పిన్నెల్లి అరాచకాన్ని త్వరలోనే అంతమొందిచాలన్నారు. ఓటమి భయంతో ఈవీఎంల ధ్వంసంతోపాటు దాడులకి తెగబడిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

## వైసీపీ ఎమ్మెల్యేలను శిక్షించాలి

- జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్



పల్నాడు (చైతన్యరథం): సార్వత్రిక ఎన్నికల్లో అక్రమాలు, అరాచకాలకు పాల్పడిన వైసీపీ ఎమ్మెల్యేలు, నాయకులను తక్షణమే అరెస్టు చేసి శిక్షించాలని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ డిమాండ్ చేశారు. బుధవారం నరసరావుపేట జిల్లా టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... భారత రాజ్యాంగం ప్రజలకు ప్రసాదించిన ఓటు హక్కుకు భంగం కలిగించే విధంగా మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎంలను బద్దలు కొట్టి బీభత్సం సృష్టించడం దారుణమని, అతనిపై ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకోవాలని కొమ్మాలపాటి డిమాండ్ చేశారు. 'ఎన్నికల ప్రవర్తనా నియమావళి, నిబంధనలు అతిక్రమించి పాల్వాయి గేటు పోలింగ్ కేంద్రం 202తో పాటు మరో కొన్ని కేంద్రాల్లో ఈవీఎం మిషన్లు ధ్వంసం చేశారని, అతని వికృత చేష్టలను అడ్డుకున్న తమ పార్టీ ఏజెంట్లు, కార్యకర్తలపై దాడులకు పాల్పడ్డారన్నారు. పోలింగ్ రోజు, ఆ మర్నాడు నియోజకవర్గంలోని పలు చోట్ల దాడులు చేసి, వాహనాలు దహనం చేశారు. పిన్నెల్లి బ్రదర్స్‌ని ఎన్నికల్లో పోటీకి అనర్హులుగా ప్రకటించడంతో పాటు కౌంటింగ్ ప్రక్రియ నుంచి తొలగించాలి. గురజాల నియోజకవర్గంలో కాసు మహేష్‌రెడ్డి రౌడీలతో హల్‌చల్ చేసి ఓటర్లను భయ భ్రాంతులకు గురిచేశాడు. సత్తెనపల్లి నియోజకవర్గంలో మంత్రి అంబటి రాంబాబు కూడా ప్రత్యక్షంగా గొడవలకు పాల్పడ్డాడు. ఆయన ఘర్షణలను రెచ్చగొట్టే విధంగా రౌడీలను ప్రోత్సాహించారు. నరసరావుపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఈసీ ఆదేశాలు ధిక్కరించాడని, పోలీసు గృహ నిర్బంధం నుంచి ఎమ్మెల్యే గోపిరెడ్డి తప్పించుకుని మా పార్టీ అభ్యర్థి చదలవాడ అరవిందబాబుపై స్వయంగా దాడికి పాల్పడ్డాడు. మీసం తిప్పి తొడగొట్టి రౌడీలను రెచ్చగొట్టి అల్లర్లు సృష్టించి, దాడులకు పాల్పడ్డారు. ఇవి ఆరోపణలు కాదని, వీడియో, ఇతర సాక్ష్యాలున్నాయి. వైసీపీ ఎమ్మెల్యేలను అరెస్టు చేసి శిక్షించాలని, వారందరిపై అనర్హత వేటు వేయాలని కొమ్మాలపాటి డిమాండ్ చేశారు.

## ఏపీలోని ఈ జిల్లాలో నేడు, రేపు వర్షాలు



అమరావతి (చైతన్యరథం) : నైరుతి బంగాళాఖాతంలో తమిళ నాడు పరిసర ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం వల్ల ఏర్పడ్డ అల్పపీడనం కారణంగా శుక్రవారం ఉదయానికి వాయు గుండంగా మారుతుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ ప్రభావం వల్ల రాగల రెండు రోజుల్లో ఆంధ్రప్రదేశ్ లోని పలు జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ అధికారులు తెలిపారు. గురువారం పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. శుక్రవారం శ్రీకాకుళం , విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల , పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైయస్ఆర్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడుతాయని వివరించారు.

## పులివర్తి నానిని పరామర్శించిన కొలికలపూడి



తిరువూరు (చైతన్యరథం): పోలింగ్ మరుసటి రోజు వైస్సార్సీపీ మూకల దాడి లో గాయపడిన చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పులివర్తి నానిని తిరుపతిలో తిరువూరు నియోజవర్గ టీడీపీ అభ్యర్థి కొలికపూడి శ్రీనివాసరావు వారి స్వగృహంలో కలిసి పరామర్శించారు. ఎన్నికల ముగిసిన అనంతరం కొలికపూడి శ్రీనివాసరావు శ్రీ షిరిడి సాయినాధుని దర్శించుకున్నారు. నేడు కొలికలపూడి తిరుమల శ్రీవారి దర్శనం చేసుకోనున్నారు. నిన్నటి రాత్రి తిరుమలలో బస చేసిన ఆయన, నేడు ఉదయం స్వామి వారి దర్శనం ప్రత్యేక పూజలు నిర్వహించబోతున్నారు.

# థైరాయిడ్‌తో అన్నీ తలనొప్పులే..!



ప్రస్తుతం సమాజంలో చాలామంది థైరాయిడ్ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. థైరాయిడ్ సమస్య వల్ల విపరీతంగా బరువు పెరుగుతూ, తద్వారా అనేక అనారోగ్యాలకు గురవుతున్నారు. హైపో థైరాయిడిజం బారినపడిన వారిలో బరువు పెరగడం ప్రధానంగా కనిపిస్తుంది. అలాంటి వారు బరువు తగ్గాలంటే ఆహారం విషయంలో జాగ్రత్త వహించాలని చెప్తున్నారు వైద్యులు.

థైరాయిడ్ ఒక దీర్ఘకాలిక సమస్య. భారతదేశంలో ప్రతి పది మందిలో ఒకరి కన్నా ఎక్కువ మంది థైరాయిడ్ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. 2021 గణాంకాల ప్రకారం 4.2 కోట్ల మంది థైరాయిడ్ పేషెంట్లు భారత్‌లో ఉన్నారు. 44.3 శాతం మహిళల్లో డెలివరీ తర్వాత తొలి మూడు నెలల్లో థైరాయిడ్ సమస్య వచ్చే అవకాశం ఉంది. ఇది మహిళలు, పురుషులు ఇద్దరిలోనూ వస్తుంది. కానీ ఈ సమస్య మగవారిలో కన్నా, ఆడవారిలో దాదాపు రెట్టింపు కనిపిస్తుంది. దీంతో థైరాయిడ్‌పై అవగాహన కల్పించేందుకు మే 25ను 'వరల్డ్ థైరాయిడ్ డేగా నిర్వహిస్తున్నారు. ఇప్పుడు థైరాయిడ్ గురించి పూర్తిగా తెలుసుకుందాం...



థైరాయిడ్ అనేది సీతాకోక చిలుక ఆకారంలో కంఠం వద్ద ఉండే ఒక ఎండోక్రైన్ గ్లాండ్, ఇది థైరాక్సిన్ అనే థైరాయిడ్ హార్మోన్‌ని విడుదల చేయడం ద్వారా బాడీలో అనేక జీవ క్రియలను ప్రభావితం చేస్తుంది. ఇది అస్తవ్యస్తం అవ్వడం వల్ల పలు సమస్య లు ఎదురవుతాయి. తగినంత థైరాయిడ్ హార్మోన్ విడుదల కాకపోవడం (హైపోథారియిడిజం), అవసర మైన దాని కన్నా ఎక్కువగా థైరాయిడ్ 'విడుదల కావ డం (హైపర్‌థైరాయిడిజం), థైరాయిడ్ స్వెల్లింగ్ (గాయిటర్), థైరాయిడ్ ట్యూమర్స్, థైరాయిడ్ క్యాన్సర్స్ ఉంటాయి. హైపోథైరాయిడిజం, హైపర్‌థైరా యిడిజం అనేవి చాలా కామన్‌గా ఉండే థైరాయిడ్ డిజార్డర్స్.

హైపో థైరాయిడ్ సమస్య హైపర్ థైరాయిడ్ కన్నా అయిదు రెట్లు అధికంగా ఉంది. ఎక్కువగా ఈ రెండు సమస్యలే వస్తున్నాయి. గర్భిణుల్లో ఈ సమస్యను ముందుగా గుర్తించకపోతే, పుట్టే పిల్లల్లో మేధాపరమైన లోపాలు ఉండవచ్చు. చిన్నతనంలోనే ఈ సమస్య గుర్తించడం మంచిది. లేదంటే, పిల్లల ఎదుగుదల శారీరకంగానే కాదు, మానసికంగానూ మందగించే ప్రమాదం ఉంది. కాబట్టి థైరాయిడ్ సమస్యను ఆలస్యం చేయకుండా గుర్తించి, దానికి సరైన చికిత్స పొందడం చాలా ముఖ్యం. సరైన ఆహారపు అలవాట్లు, జీవనశైలి సరిగ్గా లేకపోవడం వల్ల హార్మోన్లు అసమతుల్యం అవుతాయి. తద్వారా థైరాయిడ్ వస్తుంది. ఇది మందులతో కంట్రోల్ అవుతుంది అనుకోవడం తప్పు. మందులతో పాటు సరైన ఆహారం తీసుకోవడం వల్ల ఈ సమస్యను నియంత్రించవచ్చు. థైరాయిడ్ ప్రారంభ లక్షణాలపై శ్రద్ధ వహిస్తే, జీవనశైలిలో మార్పులు చేసుకోవడం ద్వారా కొన్ని చికిత్సల ద్వారా దీనిని నియంత్రించ వచ్చంటున్నారు నిపుణులు. మహిళల్లో థైరాయిడ్ సరిగ్గా పనిచేయకపోతే నెలసరులు సమయానికి రాకుండా గర్భం దాల్చే అవకాశం తగ్గిపోతుంది. కాబట్టి థైరాయిడ్ సమస్యలకు తగిన చికిత్స చేయించుకున్నట్లైతే ఈ సమస్యలనుండి దూరంగా ఉండవచ్చు.

## లక్షణాలు

### 1. హైపో థైరాయిడ్

నీరసం, మలబద్ధకం, చర్మం, వెంట్రుకలు పొడిబారడం, ఎక్కువ నిద్ర, 'బరువు పెరగడం, నెలసరిలో రక్తస్రావం ఎక్కువగా లేక తక్కువగా అవ్వడం, గర్భస్రావం, చలిని తట్టుకోలేక పోవడం, గుండె తక్కువ సార్లు కొట్టుకోవడం, జుట్టు రాలడం, థైరాయిడ్ గ్రంథి వాపు తదితర లక్షణాలు ఉంటాయి.





### 2. హైపర్ థైరాయిడ్

ఆకలి ఎక్కువ అవ్వడం, బరువు తగ్గడం, చెమటలు ఎక్కువ పట్టడం, 'చిరాకు, స్థిమితం లేకపోవడం, నిద్ర లేమి, నీరసం, ఎక్కువసార్లు విరేచనం అవ్వడం, నెలసరిలో రక్తస్రావం తక్కువగా అవ్వడం, వేడిని తట్టుకోలేక పోవడం, గొంతు ముందు వాపు, గుండె దడ అనిపించడం, కళ్లు పెద్దవిగా అవ్వడం, చేతులు వణకడం వంటివి కనిపిస్తుంటాయి.

### 3. గాయిటర్

గాయిటర్ సాధారణంగా 40 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్న, థైరాయిడ్ సమస్యతో బాధపడే మహిళలలో ఎక్కువగా కనిపిస్తుంది. అధిక బరువు, ఇన్సులిన్ రెసిస్టెన్స్, మెటబాలిక్ సిండ్రోమ్ ఉన్నవారిలో గాయిటర్ వచ్చే అవకాశం ఎక్కువ.

## జాగ్రత్తలు



థైరాయిడ్‌ను పూర్తిగా నయం చేయలేము. కానీ, మందులు, జీవనశైలి మార్పుల సహాయంతో దీనిని నియంత్రించవచ్చు. థైరాయిడ్ బాధితులు ఒత్తిడికి దూరంగా ఉండాలి. మానసిక, శారీరక ఒత్తిడి మీ శరీరంలో మంటను పెంచుతుంది. ఒత్తిడిని తొలగించుకోవడానికి ధ్యానం అలవాటు చేసుకోండి. మంచి పోషకాహారం తీసుకోవటం తప్పనిసరి. మీ ఆహారంలో తగినంత కాల్షియం, ప్రోటీన్, అయోడిన్, మెగ్నీషియం ఉండటం వల్ల మీ థైరాయిడ్ పనితీరు మెరుగ్గా ఉంటుంది. ఇది కాకుండా, థైరాయిడ్ సమస్యలు ఉన్నవారు విటమిన్ ఎ, బి, సి అధికంగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవడం మంచిది. రోజూ వ్యాయామం చేయడం ద్వారా థైరాయిడ్‌ను నియంత్రించవచ్చు. వ్యాయామం ఒత్తిడిని తగ్గిస్తుంది. జీవక్రియను మెరుగుపరుస్తుంది. క్యాబేజీ, క్యాలీఫ్లవర్, పాలకూర, ముల్లంగి, సోయాబీన్స్, స్ట్రాబెర్రీస్‌ను తినడం తగ్గించాలి. పాలు, చీజ్, మాంసం, చేపలు, ఖర్జూరం, గుడ్డు తెల్ల సొన తినాలి. పీచు పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. మందుల ద్వారా ఈ సమస్య తగ్గుతుంది. రోజూ పరగడుపునే ట్యాబ్లెట్ తీసుకోవడం వల్ల సమస్య నియంత్రణలో ఉంటుంది.

విటమిన్ డి లోపం వల్ల కూడా థైరాయిడ్ సమస్య వస్తుంది. ప్రతిరోజూ కనీసం 15 నిమిషాలు సూర్యరశ్మి శరీరానికి తగిలేలా చూసుకోవటం మంచిది. అవిసె గింజలు ఎక్కువగా తీసుకోవాలి. ఉప్పును అవసరమైన దానికంటే ఎక్కువ తీసుకుంటే థైరాక్సిన్‌ను ఎక్కువ ఉత్పత్తి చేసి హైపర్ థైరాయిడ్ కలిగేలా చేస్తుంది. ఈ సమస్య ఉన్నవారు రోజుకి 5 గ్రాముల ఉప్పుని మాత్రమే తీసుకోవాలి. వాల్నట్స్‌లో మెగ్నీషియం పుష్కలంగా ఉంటుంది. అది థైరాయిడ్ గ్రంథి పనితీరును మెరుగుపరుస్తుంది. దీంతో థైరాక్సిన్ అవసరమున్నంత మేర శరీరానికి అంది థైరా యిడ్ సమస్య నుండి ఉపశమనం పొందవచ్చు.

థైరాయిడ్‌ను అదుపులో ఉంచుకోవడానికి... కనీసం ఆరు నెలలకోసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలి. థైరాయిడ్ సమస్య ఉన్నవాళ్లు గర్భవతి అయినా చాలా జాగ్రత్తగా ఉండాలి. గర్భం దాల్చిన తరువాత అబార్షన్ అయ్యే అవకాశాలు ఉంటాయి. కాబట్టి ఎప్పటికప్పుడు డాక్టర్లను సంప్రదిస్తూ ఉండాలి. కాబట్టి గర్భవతిగా ఉన్నప్పుడు బిడ్డ ఎదుగుదల కోసం థైరాయిడ్ మాత్రలు వేసుకోవాలి. పుట్టినప్పుడు పిల్లలకు కూడా థైరాయిడ్ టెస్టు చేయించాలి. ఎందుకంటే ఒకోసారి పుట్టుకతోనే సమస్య వస్తుంది.

### రాగి మరియు ఒమేగా-3 పుష్కలంగా ఉండే ఆహారాలు ముఖ్యం

మీరు థైరాయిడ్‌తో బరువు తగ్గించే చిట్కాల కోసం చూస్తున్నట్లయితే, రాగి మరియు ఒమేగా 3 మీ ఆహారంలో భాగం కావాలని వైద్యులు చెబుతున్నారు. బాదం, నువ్వులు మరియు చిక్కుళ్ళు రాగికి మంచి వనరులు. నెయ్యి, వాల్‌నట్‌లు, అవిసె గింజలు మరియు చియా గింజలు ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్‌లకు మూలకాలని ఇక వీటిని తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అంతేకాదు శరీరాన్ని ఎప్పుడూ డీహైడ్రేట్ కానివ్వకుండా మంచినీళ్ళను తాగుతూ ఉండాలని సూచిస్తున్నారు. హైడ్రేటెడ్‌గా ఉండటం వేగంగా బరువు తగ్గడంలో సహాయపడుతుంది మరియు ఇది హార్మోన్ల పనితీరును కూడా మెరుగుపరుస్తుందని చెబుతున్నారు.

